KSR02B169C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మే 14, 2017
స్నేహ

ENTERED



బంగినపల్లి బంగారం

దాహపు చిత్రాలు



అందం, అభినయం మేళవింపుతో వచ్చే బాలీవుడ్ బడాబడ్జెట్ చిత్రాల క్రేజే వేరు. వీకిటి భిన్నంగా సామాజిక అంశాలతో కొన్ని చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. అలాంటి చిత్రాలు కాస్త అరుదుగానే వచ్చినా సక్సెస్ రేట్‌లో మాత్రం హిట్ లిస్ట్‌లో చోటుదక్కించుకున్నాయి. కరువు ప్రాంతాల్లో వాన చినుకుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే రైతుల వ్యధలని కళ్లకుకట్టినట్టు చేసిన చిత్రం లగాన్. నీటి కొరతపై సామాజిక స్పృహని పెంచిన ఈ చిత్రం ఫిల్మ్ ఫేర్ అవార్డులతోపాటు జాతీయ, అంతర్జాతీయస్థాయిలోనూ ఎన్నో అవార్డులని దక్కించుకుంది. కచ్ ప్రాంత ప్రజల ప్రేమ, అనుబంధాలే కాదు అక్కడ తీవ్ర నీటి కొరతని ప్రపంచానికి పరిచయం చేసిన చిత్రం 'జల్'. గిరీష్ మాలిక్‌కి దర్శకుడిగా తొలి చిత్రమే అయినా సామాజిక స్పృహని పెంచడంలో మంచి మార్కులే కొట్టేశాడు మాలిక్. నీటి దుర్వినియోగం వల్ల ముందు తరాలు ఎలాంటి పరిస్థితులని ఎదుర్కోవాల్సి వుంటుందో తెలిసేలా చెప్పిన చిత్రం 'కౌన్ కిత్నే పానీమే'. కునాల్ కపూర్, రాధికా ఆప్టే, సురభ్ సుక్లా, గుల్షన్ గ్రోవర్ లాంటి అగ్ర నటుల అభినయం ఈ చిత్రానికి ప్రాణం పోసింది. ఈ చిత్రం తర్వాత వచ్చిన 'వాటర్' చిత్రం అకాడెమీ అవార్డ్ నామినీ చిత్రంగా నిలిచింది. 2010లో శ్యామ్ బెనగళ్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'వెల్డన్ అబ్బా'. గ్రామంలో వున్న ఒక్క బావి ఆధారంగా వ్యవసాయం చేస్తున్న రైతుల నీటి కొరత కష్టాలని ప్రతిబింబించిన చిత్రం ఇది. నీటి కోసం రెండు ప్రాంతాల్లో జరిగే గొడవలు (వాటర్ వార్స్) కథాంశంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం పానీ. సుషాంత్ సింగ్ రాజ్‌పుత్, అనుష్క శర్మ, ఆయేషా కపూర్ ముఖ్య పాత్రల్లో శేఖర్ కపూర్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం త్వరలో నిర్మాణ దశని పూర్తిచేసుకోనుంది.







KSR02B169

ఓ జీవితకాలపు ఈత



విజేత

ఈదాలి. ఒడ్డుకు దూరంగా ఈదాలి. విశాల సంద్రంలోని సోలిట్యూడ్‌లో కలిసిపోయేంతగా ఈదాలి. మొహమ్మద్ షామ్స్ ఆలమ్ షేక్ ఎందుకిలా ఈదుతున్నాడో అని కాదు ఎలా ఈదుతున్నాడో అనేదే విషయమిక్కడ. నడుం కింది భాగం చచ్చుబడిపోయిన ఆలమ్‌కు ఈతే పునరుజ్జీవమైంది. ఒకప్పటి కరాటే చాంపియన్ జీవితాన్ని గెలిచేందుకు ఈతను ఎంచుకున్నాడు. ప్రపంచ రికార్డులను ఈదేస్తున్నాడు.

ముంబైలోని బాంద్రాలో ఆరేళ్ల క్రితం ఆలమ్ ఇప్పటిలా లేడు. రోజు మొదలయ్యేది.. పూర్తయ్యేది కరాటేతోనే. బ్లాక్‌బెల్ట్ సంపాదించి సరిపుచ్చుకోలేదు అనేక పోటీల్లో 40 బంగారు పతకాలు సాధించినా విసుగు పుట్టలేదు. ఆత్మరక్షణ విద్యను పదిమందికి నేర్పాలనే సంకల్పంతో క్వాలిఫైడ్ కోచ్‌గా కూడా తయారయ్యాడు. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఢోకా లేని ఉద్యోగం పొంది మంచి బతుకులో అడుగు పెట్టాడు. అదీ కొన్నాళ్లే..! వెన్నెముక భరించలేని నొప్పిని కలిగించడం మొదలైంది. తాను చేసే సాధనలో లోపం కాదు. శరీరంలో ఏదో తేడా వచ్చింది. అదీ ఉన్నట్టుండి పరిస్థితి ముదిరిపోతోంది. వెన్నెముకలో కణితి ఉందని వైద్యులు తేల్చారు. 2010లో ఎన్నో సర్జరీలు చేశారు. కణితి తొలగించారు కానీ ఆలమ్ దిగువ శరీరాన్ని కోల్పోయాడు. 2012 కల్లా కాళ్లు, నడుం చచ్చుబడిపోయాయి. కనీసం మూత్ర విసర్జన మీద కూడా కంట్రోల్ లేదు. వంద శాతం వైకల్యం వచ్చింది. కరాటే కోచ్, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ కదా ఆత్మరక్షణ విద్య యుద్ధ కళ అంటే శరీరానికే కాదు మానసికంగాను తలపడటం. అందుకే తన పరిస్థితి నుంచి బయటపడేందుకు ఓ పెద్ద యుద్ధమే మొదలెట్టాడు. ఓ ఎన్జీవో సంస్థ సాయంతో చికిత్స పొందుతున్న ఆలమ్‌కు ఈత మంచి వ్యాయామమే కాక శరీర కదలికల్లో కూడా మంచి మార్పు తీసుకు వస్తుందని చెప్పడంతో కరాటేతో పాటు సముద్రంలో ఈతను కూడా సాధన చేయడం మొదలెట్టాడు. దాదర్‌లోని బీఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో తొలుత ఈత నేర్చుకున్న ఆలమ్ క్రమం తప్పకుండా సముద్ర ఈతకు కూడా వెళ్లేవాడు. తన కుంగుబాటును, కదలలేనితనాన్ని ఈత తగ్గించేసింది. క్రమంగా ఈత కొట్టడం వల్ల శరీర కదలికలు మెరుగయ్యాయి. డిసేబులిటీ 72 శాతం అయ్యింది. ఇది ఊహించని మార్పే అయ్యింది.



అప్పటి నుంచి ఈత విడవలేదు. అటు చదువును కూడా. ఇంజినీరింగ్ తర్వాత చెన్నైలోని సత్యభామ విశ్వవిద్యాలయంలో ఎంబీయే చేరాడు. ఓ పక్క చదువు కొనసాగిస్తూనే మరోవైపు ఈతలో నైపుణ్యం సాధించాడు. ఉద్యోగం కూడా చూసుకున్నాడు. ఇలా ఎందుకంటే తనలా వెన్నెముక గాయాలతో నాలుగు గోడల మధ్యకే, చక్రాల కుర్చీలకే పరిమితమైన వారు తమ వైకల్యం జయించొచ్చని ప్రేరణనివ్వడానికే. ఆ ప్రేరణ దేశవ్యాప్తంగా ఉండాలని ఆయన పారాలింపియన్‌గా మారాడు. పారాలింపిక్స్ పోటీల్లో పాల్గొంటూ తన కథ అందరికీ తెలిసేలా మరో మార్గాన్ని ఎంచుకున్నాడు. ఈతలో రికార్డులు నెలకొల్పడం ద్వారా తన విజేత కథ విభిన్న ప్రతిభావంతులకు స్ఫూర్తి రగిలించాలని ప్రయత్నిస్తున్నాడు. తనకు స్ఫూర్తి ఇంగ్లిష్ చానెల్ స్విమ్మర్ పారాలింపిక్, శివ్ ఛత్రపతి అవార్డు గ్రహీత రాజారామ్ ఘాగ్. ఆర్థిక పరిస్థితులు, వైకల్యం వల్ల శారీరిక, మానసిక దుస్థితుల నుంచి బయటపడేందుకు ఆయనే తన జీవితానికి ప్రేరణనిచ్చాడని చెబుతుంటాడు.

రికార్డు సంకల్పం

ఇప్పటికే రెండు సార్లు ప్రపంచ రికార్డులు ఆలమ్ నమోదు చేశాడు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు చేర్చుకున్నాడు. 2014 నవంబర్ 26న నేవీ డే సందర్భంగా ఓపెన్ సీ స్విమ్మింగ్ కాంపిటీషన్‌లో విభిన్న ప్రతిభావంతుల కేటగిరీలో పాల్గొన్నాడు. ముంబైలోని కొలబాలో ఉన్న నౌకాదళ వాటర్‌మన్‌షిప్ శిక్షణ కేంద్రంలో ఈ పోటీల్లో ఈది సత్తా చాటాడు. 1 గంటా 40 నిమిషాల 28 క్షణాల్లో 6 కిలోమీటర్లు ఈది ఆ ఫీట్ సాధించిన తొలి విభిన్న ప్రతిభావంతుడి(100 శాతం వైకల్యంతో)గా రికార్డు సృష్టించాడు. 2012లోనే తొలిసారిగా ఈ తరహా ఈత పోటీల్లో పూనెలో జరిగిన మహారాష్ట్ర పారాలింపిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని కాంస్య (ఫ్రీస్టయిల్), రజత (బ్యాక్‌స్ట్రోక్) పతకాలను సాధించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. అదే ఏడాది చెన్నైలో జరిగిన పోటీల్లోను పతకం కైవసం చేసుకున్నాడు. 2016లో ఏకంగా నాలుగు బంగారు పతకాలను సాధించి బెస్ట్ స్విమ్మర్‌గా నిలిచాడు. 2017 బీచ్ ఫెస్ట్ సందర్భంగా గోవా తీరం నుంచి 8 కిలోమీటర్ల దూరం సముద్రంలో ఈత కొట్టాడు. సింక్వెరిమ్ బాగా కండోలిమ్ బెల్ట్‌లోని ఈ ప్రాంతంలో ఉధృతమైన ఎదురు ప్రవాహాన్ని తట్టుకుంటూ నాలుగు గంటల నాలుగు నిమిషాల్లో 8 కి.మీ.ల ఈతను పూర్తి చేశాడు. తాను నిర్దేశించుకున్న లక్ష్యం 2–2.5 గంటల లోపే. అయినా కానీ అది ప్రపంచ రికార్డు అయ్యింది. 2018 ఏసియన్ గేమ్స్, 2020 టోక్యో ఒలింపిక్స్, పారాలింపిక్స్‌కు సన్నద్ధమవుతున్నాడు ఆలమ్ .

- జేఎస్

ENTERED
కథా నిలయం

ఇండెక్స్

స్ఫూర్తి................3
మమతల తల్లి

స్టార్........4
తీయని నటన

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...............10
మాస్కోకు సైక్లింగ్..!

సేవా...............11
చల్లని తల్లి

కవిత్వమ్...............14
మనసు బావుటా...

తెలుసా 15
కుటుంబంతో గడపండి

బంగినపల్లి బంగారం



అట్టమీది కథ...6

ప్రత్యేకం - 12

యోగి వేమన ఓ కళాఖండం

కథ 16
స్థానబలిమి

సేవా...........19
అడవికి అమ్మా నాన్న

కొత్త పుస్తకాలు..............20
సరదాగా నవ్వించే కథలు

రుచి............21
క్యారెట్ ఐస్ క్రీమ్

బాల నేస్తాలు.............22
అతి చిన్న లైబ్రేరియన్

పద వికాసం........24

వినుర వేమ

ఏప్రిల్ 30 స్నేహ ఆదివారం అనుబంధం వినురవేమ ప్రత్యేక అంశంగా మహాకవి వేమన ముఖచిత్రంతో చక్కగా వుంది. తెలుగు కవులలో మణిరత్నం వేమన ఆయన గురించిన పరిచయం వివరాలు వేమన పద్యాలలోగల భావసారం చాలా చక్కగా తెలియజేసిన ప్రజాశక్తి స్నేహ డెస్క్‌కు ఇతర బృందానికి నా ప్రత్యేక ధన్యవాదాలు. తెలుగింట సాహితీ సౌరభాలు వెదజల్లుతున్న ప్రజాశక్తి స్నేహకు అభినందనలు.

-లక్కరాజు ప్రఫుల్ల చంద్ర, ధర్మవరం.

చిరస్మరణీయుడు

వినుర వేమ అట్టమీద కథ విజ్ఞానదాయకంగా వుంది. వేమన కాలానికి సంబంధించి పుట్టుక గురించి ఈ వ్యాసం లోతుగా చర్చించింది. సామాజిక రుగ్మతలను తొలగించడానికి కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొన్న వేమన నిజంగా ప్రజాకవి. సమాజాన్ని లోతుగా పరిశీలించి, లోపాలను ఎత్తి చూపిన కళారవి. వేమనను వెలుగులోకి తీసుకుని వచ్చిన సి.పి బ్రౌన్ అభినందనీయుడు. ఆటవెలదిలో సరళమైన భాషలో పద్యాలు రచించి తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన వేమన



తెలుగు కవి కావటం మనందరికీ గర్వకారణం. పాతాళభైరవి చిత్ర విశేషాలు అలరించాయి. కాశీ మజిలీ కథల్లాంటి ఒక జానపద చిత్రాన్ని సాహసోపేతంగా తెరకెక్కించిన నాగిరెడ్డి చక్రపాణిగార్ల నమ్మకం వమ్ముకాలేదు. నరుడా ఏమి నీ కోరిక , సాహసం శేయరా ఢింభకా, పింగళి వారు సమకూర్చిన సంభాషణలు ఇప్పటికే జనంనోళ్లలో మారుమ్రోగుతున్నాయి. నేపాల మాంత్రికుడుగా ఎస్వీఆర్ ముఖంలో పలికించిన హావభావాలు ప్రేక్షకుడి మనసులో చెరగని ముద్ర వేశాయి. కలవరమాయే మదిలో ఎంత ఘాటు ప్రేమయో వినవే బాల నా ప్రేమ గోల, ప్రేమ కోసమే వలలో పడెనే పాపం పసివాడు బాణీలను కూర్చిన ఘంటసాల చిరస్మరణీయుడు. అయితే ఈ సినిమాలో నటించిన కథా నాయిక మాలతి చివరి రోజుల్లో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించి ఇల్లు కూలి మరణించడం జీర్ణించుకోలేని అంశం.

-మంకు శ్రీను కొప్పర్రు

స్తినస్తేషియా విచిత్రం

అట్ట చివరి రంగుల అద్భుతాలకు అవాక్కయ్యాం. సంగీత వాద్యాల శబ్ద తరంగాలను కళాదృశ్యాలుగా పెయింటింగ్స్ మార్పు చేసే లక్షణం సినస్తేషియా వ్యాధి గ్రస్తులకి వుంటుందని కొత్తగా తెలుసుకున్నాం. సామాజిక దృక్పథం భుజాలకి ఎత్తుకొని తమ ప్రాంతాల అడవులను నరకకుండా అడ్డుకుంటున్న దేవదాస్ గోయంకా లివి కాసింగ్ దరాయ్‌లు నిజంగా ప్రకృతి ముద్దుబిడ్డలు. వేమన గురించి సమగ్ర సమాచారం తెలుసుకుని సంతోషించాం. అతి ప్రమాదకరమైన రోహడ్ వ్యాధితో బాధపడుతున్న ఏడేళ్ల చిన్నారి కథనం కలచివేసింది.

టి. సత్యనారాయణ మూర్తి, విశాఖపట్నం.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

1400 మంది బిడ్డలు. 207 మంది అల్లుళ్లు. 36 మంది కోడళ్లు. 1000 మంది మనవలు, మనవరాళ్లు... సింధుతాయ్ సప్కాల్‌కు. ఒకప్పుడు ఒక్క పూటైనా కడుపు నింపుకోవాలని భిక్షాటన చేసే పేదరాలు ఇప్పుడు ఇంత మంది బిడ్డలకు కడుపు నిండా ప్రేమను కలిపి తిండి పెడుతోన్న మమతల తల్లి. 'అనాథల అమ్మ'గా వందలాది మందిని ఓ కుటుంబంగా సాకుతున్న సింధుతాయ్ మనకో స్ఫూర్తి.



మమతల తల్లి

మహారాష్ట్రలో సింధుతాయ్ సేవల్ని అందిస్తోంది. అభాగ్యుల్ని అక్కున చేర్చుకుంటోంది. అలా అక్కున చేరిన వారు ఎదిగి పెద్దవారై డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెసర్లుగా మారారు. తమ జీవితాన్ని కన్న తల్లికి రుణం తీర్చుకోలేక ఆమె కుటుంబంలో ఒకరిగా సేవలు అందిస్తున్నారు. సింధుతాయ్‌కు మమత అనే కన్న కూతురు కూడా ఉంది. ఆమె కూడా అనాథలందరినీ తన తోబుట్టువులుగా చూసుకుంటుంది. రైల్వే స్టేషన్లు, చెత్త కుప్పల వద్ద ఆకలికి అలమటిస్తూ వీధి బాలలు కంట పడితే ఈ అమ్మ కళ్లెంట నీరు ధారలు కడుతుంది. ఒకప్పుడు తాను కూడా భిక్షగత్తెగా వీధుల్లో తిరిగేటప్పుడు ఇలాంటి వారికి ఏమీ చేయలేకపోతున్నాననే అని వ్యథ గుండెను కోసేసేది. తన కడుపులో ఆకలి మంటకు మించి కడుపు కోతను అనుభవించేది. తిండి కోసం వీధి కుక్కలతో పోటీపడే ఆ విషాద చిత్రాలే ఆమెను ఓ మహా సంకల్పం తీసుకునేలా చేశాయి. తనకు సాధ్యమైనంత మందికి తిండి పెట్టాలని. అది ఒకరా ఇద్దరా అనుకుంటూనే కాలం సాగేకొద్దీ వందల మందికి చేరిపోయింది.

గుండె కోత కూడా

సింధుతాయ్ గతం దుర్భరం. పేదింటిలో పుట్టిన ఆమెకు తొమ్మిదేళ్లకే చదువు ఆగిపోయింది. పదేళ్ల వయస్సుకే 20 ఏళ్ల వ్యక్తితో పెళ్లి చేసేశారు. 20 ఏళ్లకు గర్భవతి కాగలిగిన ఆమెను భర్త ఇంటిలోంచి నెట్టేశాడు. అదీ 9 నెలల గర్భంతో ఉండగా. సొంతవాళ్లు సాయం చేయలేకపోవడంతో ఆమె ప్రసవం ఓ పశుపాకలో జరిగింది. తన కన్నబిడ్డ మమతను వేరుచేయడానికి కన్నపేగును కత్తిరించేందుకు రాళ్లను ఉపయోగించింది. ఎవరూ సాయం చేయకపోవడంతో మమతను బతికించుకోవడం కోసం రైల్వేస్టేషన్లలో తిరుగుతూ పాటలు పాడుతూ బిచ్చమెత్తుకునేది. అప్పుడే చాలామంది పసిపిల్లలు రైల్వేస్టేషన్లలో అనాథలుగా తిరగడం అనేక దోపిడీలకు గురవడం కళ్లారా చూసింది. ఆమె తల్లి హృదయం చలించిపోయింది. వాళ్లను తన బిడ్డల్లానే చూసుకోవడం మొదలెట్టింది. తాను సంపాదించిన తిండిని వారికి పంచేది. ఆమెలో కన్నతల్లిని చూసుకున్న పిల్లలు ఆమె వెంటే ఉండటం ప్రారంభమైంది. తెలీకుండానే వారంతా ఓ పెద్ద కుటుంబంగా మారిపోయారు. వారందరి బాగోగులు చూసుకోలేకపోతున్నాననే వ్యథ ఆమెను ఓసారి ఆత్మహత్యాయత్నం వరకు తీసుకువెళ్లింది. కడుపు నిండా అన్నం తిని తన బిడ్డను గట్టిగా తన ఒంటికి కట్టుకుని ఆత్మహత్యకు ప్రయత్నించబోతుండగా ఓ బిచ్చగాడి మూలుగు వినిపించింది. దాహంతో అలమటిస్తున్న ఆ వ్యక్తి నీటి కోసం సైగ చేశాడు. అతనికి నీరు తాగిస్తుండగా విపరీతమైన జ్వరంతో బాధపడుతున్నాడని తెలిసింది. సపర్యలు చేసి తిండి పెట్టడంతో అతడు కంటతడి పెట్టుకుంటూ సింధుతాయ్‌కు మొక్కాడు. ఆ క్షణం ఆమె ఒళ్లు జలదరించింది. ఎప్పటికైనా చావాల్సిందే.. ఇలాంటి వారి కోసం బతికి ఒకరిద్దరికైనా సేవ చేయాలనే తలంపు వచ్చింది. అదే మహా సంకల్పమైంది. సింధుతాయ్ జీవితాన్ని దగ్గర నుంచి చూసిన కొందరు రైల్వే సిబ్బంది, వీధి వ్యాపారులు, రైల్వే కూలీలు అంతో ఇంతో సాయం చేస్తూ వచ్చారు. ఆమె గురించి ఆ నోటా ఈ నోటా మిగతా సమాజానికి తెలిసింది. ఆమె గాయనే కాదు, గొప్ప ప్రసంగీకురాలు కూడా. పాట అవగానే తన బిడ్డల గురించి భావోద్వేగంతో ఆమె చెప్పే విషయాలు ప్రయాణీకుల్ని కదిలించేవి. అలా సాయం అందడం పెరిగింది. దాతల నుంచి విరాళాలు అందాయి. వాటితో ఇప్పటి వరకు నాలుగు గృహాలను నడుపుతున్నారు. తన బిడ్డలు ఎదిగి మంచి ఉద్యోగాలు చేస్తూ తల్లికి తోడు నిలిచారు. అదో పెద్ద అండ. పద్మశ్రీ కన్నా 750కు పైగా పురస్కారాల కన్నా అది చాలా విలువైందామెకు. అందుకే ఆమె కుటుంబం మరింత విస్తరించింది.

అదో పెద్ద కుటుంబం

మిగతా అనాథ శరణాలయాల్లా కాక ఇక్కడ 18 ఏళ్లు నిండినా ఆమె ఇంటి తలుపులు తెరిచే ఉంటాయి. ఓ కుటుంబంలోని పిల్లలు ఎలా చదువులకు, ఉద్యోగాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుంటారో అలా సింధుతాయ్ గృహానికి వెళ్లి వస్తుంటారు. చట్టప్రకారం మేజర్లు అయినంత మాత్రాన తమ సొంత జీవితాలు తీర్చిదిద్దుకునేంత వివేకం వారికి వస్తుందా అని సగటు తల్లి కన్నబిడ్డను చూసి ప్రతిస్పందించినట్టే సింధుతాయ్ మాట్లాడుతుంది. వాళ్లు ఏదొక పనిలో కుదురుకుని ఇంటివారై జీవితాన్ని చక్కదిద్దుకున్నాక అది కూడా భారంగానే వారి సొంతానికి వదిలేస్తుంది.

రెక్కలున్నాయి కదా అని పక్షి ఎగరగలుగుతుందని అనుకోవచ్చా అది ఎగరడం నేర్చుకున్నాకే వదిలిపెట్టాలి. తన బిడ్డల విషయంలో కూడా అంతే. పెళ్లీడుకి వస్తే తానే మంచి సంబంధం చూసి వివాహం జరిపించి ఓ ఇంటివారిని చేస్తుంది. రక్త సంబంధాలు గాయాలు చేసినా ఏ సంబంధం లేని వారిని కన్నబిడ్డలుగా పెంచుతోన్న ఈ తల్లి జీవితం మనిషికి, సమాజానికి చాలా గొప్ప విలువల పాఠం. ✶

తీయని నటన

ఓ అమాయక పిల్ల ఓ వ్యవస్థనే ఎదురించే శక్తిగా మారే కథ తయారైంది. పేరు కాంచీ. ఎవర్నీ ఆ పాత్రలోకి తీసుకోవాలో సుభాష్ ఘాయ్‌కు తెలీడం లేదు. అమాయకంగా నటించడమే కాదు ముఖం చూడగానే ఆ భావన కలగాలి. ఈ అమ్మాయి ఏం చేయగలుగుతుంది పాపమనే జాలి ప్రేక్షకుడిలో మెదలాలి. అప్పుడే బెంగాలీ నటి మిస్తీ (ఇంద్రాణి చక్రబర్తి) గురించి తెలిసింది. చూడగానే సుభాష్ ఘాయ్‌కు కూడా ఈ అమ్మాయి కోసమే కథ రాసినట్టుంది అనుకున్నాడు. అంతే బాలీవుడ్‌లో ఓ బలమైన కథతో పరిచయమైంది మిస్తీ. ఆ తర్వాత దక్షిణాది చిత్రాల్లోను నటిస్తోంది. 'కాంచీ : ది అన్‌బ్రేకబుల్' ట్యాగ్‌లైన్ ఆమెకు పక్కాగా సరిపోతుంది. విలక్షణమైన పాత్రల్లో నటిస్తూ కెరీర్‌లో ముందుకు సాగుతోంది.

మిస్తీ అసలు పేరు ఇంద్రాణి చక్రబర్తి. ఇంట్లో ముద్దుగా పిలిచే మిస్తీనే స్క్రీన్ నేమ్ అయిపోయింది. మిస్తీ అంటే తీయని అని అర్థం.

◆ కోల్‌కతా విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ ఆనర్స్‌లో పట్టా సాధించిన మిస్తీ బెంగాలీ చిత్రాల్లో తొలుత నటించింది.

◆ కొన్ని రోజులు ఇంగ్లిష్ టీచర్‌గాను పాఠాలు చెప్పింది. పదో తరగతిలో ఉండగానే తోటి విద్యార్థులకు ఇంగ్లిష్ ట్యూషన్లు చెప్పేదట.

◆ ఆమె విద్యార్థుల్లో ఒకరి తల్లి డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్ శోభా మిత్రా. ఆమె మిస్తీని చూసి కొన్ని షార్ట్‌ఫిల్మ్స్‌లో నటించాల్సిందిగా ఒప్పించింది.

◆ ఆమె తొలి చిత్రం బెంగాలీ 'బిదేహిర్ ఖోంజే రబీంద్రనాథ్'. 'పొరిచొయ్' రెండో చిత్రానికే బెంగాలీ సూపర్‌స్టార్ ప్రసేన్‌జీత్ ఛటర్జీతో కలసి నటించింది.

◆ ప్రఖ్యాత దర్శకుడు సంఘమిత్ర చౌదరి తీసిన 'ది స్ట్రింగ్స్ ఆఫ్ ప్యాషన్'లో జీనత్ అమన్, శుభ్ ముఖర్జీలతో స్క్రీన్ షేర్ చేసుకుంది.

◆ కాలేజీలో ఉండగానే మిస్తీ నటించిన ఓ బెంగాలీ చిత్రానికి అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన అరింధమ్ రే బాలీవుడ్ దర్శకుడు సుభాష్ ఘాయ్‌కు చీఫ్ అసిస్టెంట్. ఆయన ద్వారానే 'కాంచీ'లో అవకాశం దక్కింది. అంతకు ముందు 400 మందిని ఆడిషన్ చేసినా సుభాష్‌కు ఎవరూ నచ్చలేదు.

◆ సుభాష్ ఘాయ్ ద్వారా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి సూపర్‌స్టార్‌లుగా మారిన మీనాక్షి, మాధురి దీక్షిత్, మహిమాల్లా మిస్తీ కూడా టాలెంటెడ్ నటి అని ఆయనే కితాబు ఇచ్చారు. అందం, అభినయం కలగలిసిన నటిగా పేర్కొన్నారు. 'కాంచీ'లో ఆమె నటనే దానికి ఉదాహరణ.

◆ తెలుగులో నితిన్‌తో కలసి 'చిన్నదానా నీ కోసం' చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

◆ ప్రస్తుతం ఓ తెలుగు చిత్రం విడుదలవగా ఎమ్మెస్ రాజు చిత్రం 'కొలంబస్'లోను నటించింది.

◆ బాలీవుడ్‌లో 'గ్రేట్ గ్రాండ్ మస్తీ' రెండో చిత్రం. ఈ మధ్యే వచ్చిన విద్యాబాలన్ 'బేగంజాన్'లో ఓ కీలక పాత్ర పోషించింది. తమిళ్‌లో 'సెమ్మ బొత అగాథ', మలయాళంలో 'ఆడమ్'లో హీరోయిన్‌గా నటించింది.

◆ మిస్తీకి నటనే కాదు లోకేషన్ల మీద కూడా మంచి అభిరుచి ఉంది. భారత్‌లో అయితే పంచగనీ, విదేశాల్లో అయితే బార్సిలోనా, స్విట్జర్లాండ్‌లు ఫొటోజెనిక్‌గా ఉంటాయని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.

◆ తన మొదటి చిత్రం బెంగాలీ 'పొరిచొయ్' షూటింగ్ కోసం ఆమె ఒంటరిగానే బ్రిటన్ వెళ్లింది. అదే తొలి విదేశీ ప్రయాణం.

◆ మిస్తీకి ఏకాంతంగా ప్రశాంతంగా ఉండే పర్యాటక ప్రాంతాలంటే ఇష్టం. ఎక్కువగా సముద్ర తీరాలను ఇష్టపడుతుంది. ద్వీపాలంటే ప్రాణం. ఫోన్‌లు, పని, మాటలు ఇలాంటి జంజాటాలేం లేకుండా కొన్ని రోజులు అక్కడ సేద దీరడమే ఆమె యాత్ర ఉద్దేశం.

◆ ఆమె నాలుకను అస్సలు చంపుకోదు. కడుపు అస్సలు మాడ్చుకోదట. వీధి దుకాణాల్లో దొరికే ఫుడ్‌ను బాగా లాగించేస్తుంది. కొత్త ప్రాంతాలు వెళ్లినప్పుడు కచ్చితంగా స్థానిక వంటకాల్ని రుచి చూడాల్సిందే.

◆ ఎత్తైన ప్రదేశాల్ని అలా చూస్తూ కాసేపు నిలబడిపోవడం అలవాటు. హోటల్ టెర్రస్ మీది నుంచి నగర దృశ్యాన్ని తాపీగా చూస్తూ ఎంజాయ్ చేయడం ఒకటైతే బంగీ జంప్, ప్యారా గ్లైడింగ్‌లు ఇష్టమైన సాహస కృత్యాలు. ★

నవ్వుల్ - పువ్వుల్

కథా నిలయం
శ్రీకాకుళం

ఎవరు పిరికోళ్లు

భర్త : నేను పిరికి వాణ్ణి కాదు నాకు భయమంటే తెలీదు. నువ్వంటే అస్సలు భయం లేదు!!

భార్య : అవునా....

భర్త : హ..అవును

భార్య : పెళ్ళిచూపులప్పుడు నన్ను చూడటానికి నలుగురైదుగురిని మందిని తీసుకొని వచ్చారు!! పెళ్ళికి నాలుగైదు వందల మందితో వచ్చారు అవునా....

భర్త : అవునే ఐతే ఏంటి??

భార్య : నేను మాత్రం మీ ఇంటికి వచ్చేప్పుడు ఒక్కదాన్నే వచ్చా ఇప్పుడు చెప్పండి ఎవరు పిరికి వాళ్లు.

భర్త : ఆ...

పిసినారి



అప్పారావు, సుబ్బారావు డాక్టర్ దగ్గరి కెళ్ళారు.

డాక్టర్ : చెప్పండి ఏమైంది?

అప్పారావు : డాక్టర్ నేను పది రూపాయల బిళ్ల మింగేశాను...

డాక్టర్ : ఏం పరవాలేదు. భయపడకండి. నేను బయటకు తీస్తాను.

డాక్టర్ : మరి మీరెందుకొచ్చారు (సుబ్బారావుతో)

సుబ్బారావు : ఆ పది రూపాయల బిళ్ల నాదే డాక్టర్! మీరు బయటికి తీసాక తీసుకెళదామని వచ్చా..

కిసుక్కు

బ్యాంకులో చెక్ మార్చుకున్న సుబ్బారావు అక్కడ క్యాషియర్‌తో ఇలా అన్నాడు.

సుబ్బారావు : సార్ మీ పెన్ ఇంక్ నా చేతికి అంటుకుంది. నీళ్లతో కడిగేస్తే పోతుందా??

క్యాషియర్ :పోదు!

సుబ్బారావు : సబ్బు, షాంపుతో కడిగితే పోతుందా??

క్యాషియర్ : పోదయ్యా ...పోదు (చిరాగ్గా)

సుబ్బారావు : ఎన్ని రోజుల వరకు పోకుండా వుంటుంది.

క్యాషియర్ : సంవత్సరం వరకు (కోపంగా చెప్పాడు)

సుబ్బారావు : అయితే కొంచెం నా జుట్టుక్కూడా పూయండి సార్. ఎంత డై రాసుకున్నా వారం రోజులకే జుట్టు తెల్ల బడుతోంది.

క్యాషియర్ : వెళ్లవయ్యా....బాబూ...

పరీక్ష

బంటి: ఒరేయ్ చింటు ఒకసారి మా యింటికి వస్తావా...

చింటు : ఎందుకురా?

బంటి : నేను ఒక కుక్కని కొన్నాను....

చింటు : ఓ దాన్ని చూడ్డానికా...ఇప్పుడే వస్తా..

బంటి : కాదు ...అది దొంగల్ని పసిగడుతుందో లేదో టెస్ట్ చేద్దామని!!

కిసుక్కు చిత్రం



దొరికేసింది.. పరుగెత్తరోయ్..!

నాకు నచ్చిన చిత్రం



ఇల్లస్ట్రేటర్ : డేవిడ్ బొనాజ్జి

సేకరణ: పి.బాలు, మచిలీపట్నం

బంగినపల్లి బంగారం

అన్ని రకాల పండ్లలో మామిడి రారాజైతే... మామిడి పండ్లలో బంగినపల్లి మామిడి మహారాజు. ఈ పోలిక ఎలా ఉన్నా ప్రపంచ ప్రఖ్యాత మామిడి రకాల్లో అరుదైనది బంగినపల్లి రకం అని అంతా ఏక వాక్యంతో అంగీకరిస్తారు. బంగినపల్లి మామిడి పండుది చూపు తిప్పుకోలేని అందం.. పసిడి వన్నెపు మెరుపు.. నోరూరించే రుచి.. మత్తెక్కించే వాసన.. తినే కొద్దీ కమ్మని అనుభూతి.. మామిడి పండ్లలోనే అత్యంత మధురమైన పండు ఇది. తెలుగునాట ఆంధ్రప్రదేశ్‌లో పుట్టి అనేక దేశాల ప్రజలకు అత్యంత ఇష్టమైన మామిడి పండుగా బంగినపల్లి రకం నిలుస్తోంది. బేనీషాన్ అనే ఈ మామిడి రకానికి తాజాగా భౌగోళిక విశిష్ట గుర్తింపు కూడా లభించింది. ఇది 'ఆంధ్రప్రదేశ్ సొంతం' అని నిర్ధారిస్తూ జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ వచ్చింది. మనకే సొంతమైన బంగినపల్లి మామిడి విశేషాలు ఈ వారం అట్టమీది కథ.

- బెందాళం క్రిష్ణారావు
9493043888

చూడటమే ఆలస్యం బంగినపల్లి మామిడిని తినాలనిపిస్తుంది. వేసవి కాలం వచ్చిందంటే చాలు.. బంగినపల్లి మామిడిని రుచి చూడకుండా ఉండలేరు. అంతగా నోరూరించే మామిడి పండును ఇంటికి కొనుక్కొచ్చుకోవడం కోసం మార్కెట్‌లు, సంతలు ఎంత గాలించైనా ఎంత ఎండలనైనా లెక్కచేయరు. బంగినపళ్లో అనే బుట్ట వ్యాపారుల అరుపుల కోసం అటెన్షన్‌గా లేని గృహిణులుండరు. కొనగలిగినా లేకున్నా కనీసం బేరం వంకతోనైనా కాసేపు చేతులతో తడుముతూ మురిసిపోయే దృశ్యాలు ఎక్కువగానే ఉంటాయి. ఈ ప్రత్యేక ప్రేమ మరే పండు మీదా కనిపించదు. మార్కెట్‌లోకి బంగినపల్లి రాగానే ఏదో మారాజు వచ్చినట్టు వార్త చకచకా చరచరా ఊరంతా పాకేస్తుంది. పని గట్టుకుని ఆ శుభవార్త మోసుకెళ్లాలని రోజుకు రెండు మూడు మార్లు అంగళ్ల చుట్టూ తిరిగే మామిడి ప్రియులు కనిపిస్తుంటారు. ఇదీ బంగినపల్లి క్రేజ్. ఉగాది నాటికే అన్ని రకాల మామిడి కాయలు అందుబాటులోకి వచ్చేస్తాయి. ఆ తర్వాత కొన్ని రోజుల వ్యవధిలో బంగినపల్లి ఎంట్రీ ఇస్తుంది. వేసవి తాపానికి విసిగిపోయి అలసిపోయి సొమ్మసిల్లిపోయి వర్షాల కోసం ఎలా ఎదురుచూస్తారో... అంతకు ముందు నానా మామిడి రకాల రుచులను చూసినా బంగినపల్లి రకం కోసం అలా ఎదురుచూస్తుంటారు. వర్షాల కన్నా ముందే తీపి కబురులా వచ్చే బంగినపల్లిని ఆస్వాదిస్తూ సంతోషంగా వేసవి సెలవులకు ముగింపు పలకడం కుదిరితే ఓ ఆచారం చేసేయొచ్చేమో. రాసుకోని ఈ సంప్రదాయం ఈనాటిది కాదు. కొన్ని వేల సంవత్సరాల చరిత్ర ఉన్న మామిడి ఈ దేశపు జాతీయ ఫలంగా గుర్తింపు పొందింది. మామిడి రకాలన్నీ మాంగిఫెరా ప్రజాతికి చెందిన వృక్షాలే.

వీటి కాయలను ఊరగాయల తయారీలో ఉపయోగిస్తారు. మామిడి పళ్ల నుండి రసం తీసి తాగుతారు. వీటి నుండి మామిడి తాండ్ర తయారు చేసి అమ్ముతారు. స్వీట్లు తయారు చేస్తారు. ఇలా ఎన్నో రకాల ఆహార ప్రయోజనాలున్నాయి. అంతేకాదు ఆరోగ్య పోషకాలందించే కెరోటిన్,

విటమిన్ సి, కాల్షియం వంటివి కూడా వీటిలో ఎక్కువే. తినే ఓపిక ఉండాలేగానీ మనదేశంలో వంద రకాలకుపైగా మామిడి పళ్ళు దొరుకుతాయి. వీటిలో అత్యంత రుచికరమైనది. మంచి సువాసనతో అందర్నీ మైమరపించేది బంగినపల్లి మామిడే.

బేనిషాన్ మామిడి అంటే

బనగానపల్లె మామిడిని వ్యవహారంలో బంగినపల్లి మామిడిగా మార్చారు. మరి బేనిషాన్ మామిడి అని మరో పేరు ఎలా వచ్చిందన్న సందేహానికి కూడా సమాధానం ఉంది. బనగానపల్లె సంస్థానం నవాబు మీర్ గులాం అలీఖాన్ (1905-1922)కు మామిడి పండ్లపై మక్కువ ఎక్కువ. ఆయన ఒక్కొక్క రకం మామిడి చెట్టుకి ఒక్కొక్క రకం గుర్తు (నిషాన్) చెక్కించేవాడు. అయితే ఈ రకం మామిడి చెట్టుకి ఏ గుర్తు చెక్కించక, దానికి 'గుర్తు లేనిది' (బే నిషాన్) అని నామకరణం చేయించాడు. అదే వాడుకలో బేనిషాన్ అయ్యింది.

ప్రత్యేక గుర్తింపు- జీఐ

అపురూపమైన ప్రత్యేకతలున్న బంగినపల్లి మామిడికి వారం కిందటే ప్రత్యేక గుర్తింపు లభించింది. తెలుగింట పుట్టి ప్రపంచంలోని అనేక దేశాల ప్రజల నోరూరించే ఈ రకం మామిడి 'ఆంధ్రప్రదేశ్ సొంతం' అని నిర్ధారిస్తూ భౌగోళిక విశిష్ట గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటికేషన్ - జీఐ) లభించింది. చెన్నైలోని జీఐ రిజిస్ట్రీ ఓపీ గుప్తా ఈ నెల ప్రారంభంలో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేశారు. ఒక మహిళ, పురుషుడు (రైతులు), పసుపు పచ్చ వర్ణంలో మామిడిపండ్లతో బనగానపల్లె నవాబు యుద్ధ నిధుల మొహరీ రూపొందించారు. దానిపై... 'బనగానపల్లె మామిడిపండ్లు - ఆంధ్రప్రదేశ్' అని రాయించారు. ఇదే ప్రధాన ఆధారంగా బంగినపల్లి మామిడిపండ్లకు జీ.ఐ. గుర్తింపు లభించింది. ఏదైనా ఒక వస్తువు, ఉత్పత్తి మూలాలు, లక్షణాలు ఒక ప్రాంతానికి సొంతం అని నిర్ధారించేందుకు ఇది అధికారికమైన గుర్తింపు. బంగినపల్లి మామిడికి మన రాష్ట్రానికి జీఐ రిజిస్ట్రేషన్ ఇవ్వాల్సిందిగా 2011లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం జీఐ రిజిస్ట్రీని కోరింది. అప్పటి హార్టికల్చర్ కమిషనర్ రాణీ కుముదిని దీనికి సంబంధించిన ఆధారాలతో నివేదిక రూపొందించారు. "కర్నూలు జిల్లాల్లోని బనగానపల్లె, నంద్యాల, పాణ్యం మండలాలే బంగినపల్లి మామిడికి పుట్టిల్లు. కోస్తాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాలు... తెలంగాణలోని ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలు ఈ రకం మామిడికి రెండో పుట్టిల్లుగా చెప్పవచ్చు. 7.66 లక్షల కుటుంబాలు బంగినపల్లె మామిడిపండ్లను సాగు చేస్తున్నాయి. బంగినపల్లి మామిడిపండ్ల వార్షిక టర్నోవర్ సుమారు రూ.1,461 కోట్లు, వివిధ ప్రాంతాల్లో వీటిని బెనెషాన్, బనెషాన్, సఫేద అని కూడా పిలుస్తారు. " అని అప్పట్లో ఆ నివేదికని సమర్పించారు. దీనికి సంబంధించిన ఆధారాలను ధ్రువీకరించుకున్న అనంతరం బంగినపల్లి మామిడిపై ఆంధ్రప్రదేశ్‌కు జీఐ గుర్తింపు ఇచ్చారు. రైతులకు మెరుగైన మార్కెట్ ధర లభించేందుకు జీఐ ట్యాగ్ ఉపకరిస్తుంది. మేధో సంపత్తి హక్కుల్లో జీఐ ట్యాగ్ కూడా ఒక భాగం.

అందర్నీ మెప్పిస్తూ

ఏమాత్రం పీచు లేకుండా పూర్తిగా గుజ్జు మాత్రమే ఉండడం బంగినపల్లి మామిడి ప్రత్యేకత. పండే కాదు కాయ కూడా తినడానికి చాలా రుచిగా ఉంటుంది. పండుని కూడా తొక్క తీయకుండా అలానే తినేయొచ్చు. దీని రుచి ఎందరో



మహామహులను కట్టిపడేసింది. పెండేకంటి వెంకటసుబ్బయ్య కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ప్రతి ఏటా అప్పటి ప్రధాని ఇందిరా గాంధీకి బనగానపల్లె నుంచి బంగినపల్లి పండ్లను పంపించేవారు. అనంతరం రాజీవ్‌గాంధీ కూడా బంగినపల్లి మామిడి తెప్పించుకొని రుచి చూశారు.

ఆర్టీసీ బస్సులపై లోగోగా

ఒకప్పుడు ఆర్టీసీ డిపోలకు స్థానిక ప్రత్యేక చిహ్నాలు ఉన్న సమయంలో... బనగానపల్లె డిపో బస్సులపై మూడు బంగినపల్లి మామిడి పండ్ల గుత్తి 'లోగో'గా కనిపించేది. ఈ రకం మామిడి బనగానపల్లెకు ప్రత్యేకం అంటూ అప్పట్లోనే ఆర్టీసీ సంస్థ గుర్తించడం విశేషం.

విదేశాలకూ ఎగుమతి

బంగినపల్లి మామిడి కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. కొన్ని వందల సంవత్సరాలుగా విదేశాలకు కూడా ఎగుమతౌతోంది. బాగా మంచి పరిమాణంలో ఉన్న ఈ మామిడి రకం ఒక పండు రెండు కిలోల బరువుతూగిన సందర్భాలు కూడా ఉన్నాయి. బనగానపల్లె నుంచే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాలకు ఈ రకం మామిడి సాగు విస్తరించింది. ప్రతి ఏటా ఆరువేల టన్నుల బంగినపల్లి మామిడి పండ్లు అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. శీతలీకరణ నిల్వ (కోల్డ్ స్టోరేజ్) లో మూడు నెలల వరకూ తాజాదనం కోల్పోకుండా ఈ పండ్లు ఉంటాయి.

పేరు వెనుక



బంగినపల్లి మామిడి ఆ పేరు ఎలా వచ్చిందో ఇప్పటికీ చాలామందికి తెలియదు. ఒక ఊరి పేరే ఈ మామిడికి బ్రాండ్ నేమ్‌గా మారిపోయింది. అదేమిటంటే కర్నూలు జిల్లాలోని బనగానపల్లె. ఈ ఊరిపేరు వినగానే కాలజ్ఞానం చెప్పిన పోతులూరి వీరబ్రహ్మం గుర్తొచ్చారు కదా. అయితే ఆయనే చెప్పలేనంతగా ఈ ఊరి పేరుతో మామిడి రకం ప్రపంచంలోనే ప్రాముర్యం పొందుతోంది. మూడున్నర శతాబ్దాల కిందట ఈ బనగానపల్లె నివాసులైన నవాబులు విదేశాల నుంచి తీసుకొచ్చి అంటుకట్టిన మామిడి రకాలలో ఒక మామిడి రకం ఇది. రుచిలోను, రంగులోను, పరిమాణంలోను విశేషమైన ఖ్యాతిని సంపాదించడంతో ఈ చెట్టుకు కాసిన మామిడి పండ్లను అనేక ప్రాంతాల వారు తీసుకుని వెళ్లి నాటారు. ఈ చెట్టు ఎక్కడ నుంచి తెచ్చి నాటారు అని అడిగినప్పుడు ఇది బనగానపల్లి మామిడి చెట్టు అని చెబుతుండేవారు. ఈ విధంగా బనగానపల్లి మామిడిగా అందరినోటా నానుతూ ఇది కాలగమనంలో బంగినపల్లి మామిడిగా పేరు మారింది.

ఆరోగ్యానికి కూడా

మామిడి శారీరక ఆరోగ్యానికి మార్గదర్శిగా నిలుస్తోంది. బంగినపల్లి మామిడిలోనూ ఈ ప్రత్యేక లక్షణాలున్నాయి. మామిడి రొమ్ము, పెద్దపేగు క్యాన్సర్ కణాల పెరుగుదలను అరికడుతుంది. ఈ మామిడి పండ్ల నుంచి తీసిన పాలీఫెనోల్‌లో క్యాన్సర్ కణాల పెరుగుదలను అరికట్టే గుణం ఉన్నట్టు నిపుణులు కనుగొన్నారు. మామిడి పండ్ల నుంచి తీసిన పాలీఫెనోల్‌ను.. రొమ్ము, పెద్దపేగు, ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, రక్త క్యాన్సర్ల బాధితులకు ఇచ్చి పరీక్షించారు. క్యాన్సర్ కణాల వృద్ధిని అడ్డుకోవటమే కాదు, ఇది రెండు క్యాన్సర్ కణాలను చనిపోయే స్థితికి తెచ్చినట్టు గుర్తించారు.

ఔషధంగా బంగినపల్లి మామిడి

- పాదాల పగుళ్ల నివారణకు మామిడి జిగురుకు మూడురెట్లు నీళ్ళు కలిపి పేస్టులా చేసి ప్రతిరోజూ పాదాలకు లేపనం చేసుకోవాలి. దీనితోపాటు ప్రతిరోజూ బూట్లు, సాక్సులు ధరించాలి.
- పంటినొప్పి, చిగుళ్ళ వాపు వంటి దంత సమస్యల నివారణకు రెండు కప్పులు నీళ్ళు తీసుకొని మరిగించాలి. దీనికి రెండు పెద్ద చెంచాలు మామిడి పూతను వేసి మరికొంతసేపు మరగనివ్వాలి. స్టవ్‌మీద నుంచీ దింపి గోరువెచ్చగా ఉన్నప్పుడు పుక్కిలించాలి. అవసరాన్ని బట్టీ ఇలా రోజుకు రెండుమూడుసార్లు చేయాలి.
- కడుపులో పురుగుల సమస్య నివారించాలంటు మామిడి టెంకలోని జీడిని వేరుపరచి ఆరబెట్టాలి. దీనికి పెద్ద చెంచాడు మెంతులను కలిపి మెత్తగా నూరాలి. దీనిని ఒక సీసాలో జాగ్రత్తచేసుకొని కొన్నిరోజులపాటు మజ్జిగతో కలిపి తీసుకోవాలి. ఆర్శమొలల సమస్య నివారణకు అర చెంచాడు మామిడి జీడిని పొడి రూపంలో పెరుగుమీది తేటతో కలిపి తీసుకోవాలి.
- మామిడి వేర్లను మెత్తగా రుబ్బి అరికాళ్ళకు, అరిచేతులకు రాసుకుంటే జ్వరంలో కనిపించే వేడి తగ్గుతుంది.
- మామిడి ఆకుల బూడిదను 'డస్టింగ్ పౌడర్'లా వాడితే గాయాలు త్వరగా నయమవుతాయి.
- ఎగ్జిమాను పోగొట్టుకోవాలంటే మామిడి చెట్టు బెరడును, నల్ల తుమ్మ బెరడును తెచ్చి కచ్చాపచ్చాగా దంచి ఉంచుకోవాలి. రోజూ పిడికెడంత మిశ్రమాన్ని తీసుకొని అర లీటరు నీళ్ళలో వేసి ఆవిరి వచ్చేవరకూ మరిగించి, ఆవిరిని ఎగ్జిమా సోకిన ప్రదేశానికి తగిలేలా చేయాలి. తడి ఆరిన తర్వాత నెయ్యి రాసుకొని మర్ధనా చేసుకోవాలి.
- మామిడి బెరడును చిన్న చిన్న పీలికలు అయ్యేంతవరకూ దంచి, నీళ్ళలో వేసి మరిగించాలి. ఈ డికాక్షన్‌తో పుండ్లను, గాయాలనును కడిగితే త్వరగా తగ్గుతాయి.
- బంగినపల్లి మామిడి ముక్కలకు చెంచాడు తేనెను, పిసరంత కుంకుమ పువ్వును, ఏలకులు, రోజ్‌వాటర్లను చిలకరించి తీసుకుంటే నీరసం మటుమాయమౌతుంది.
- వడదెబ్బకు గురౌతామని భయంగా ఉందా! పచ్చి మామిడికాయను నిప్పుల మీద వేడిచేసి పిండితే సులభంగా గుజ్జు వస్తుంది. దీనికి కొద్దిగా చన్నీళ్ళను, పంచదారను చేర్చి తాగాలి. దీనివల్ల దప్పిక తీరడమే కాకుండా ఎండల తీక్షణతవల్ల కోల్పోయిన శక్తి తిరిగి వస్తుంది.
- చెమట కాయలకు చెక్ చెప్పడానికి రెండు పచ్చి మామిడి కాయలను గిన్నెలో నీళ్ళుపోసి ఉడికించాలి. చల్లారిన తర్వాత గుజ్జును పిండి పంచదార, ఉప్పు కలిపి సేవించాలి. దీనివల్ల శరీరంలో వేడి తగ్గి, ఒళ్ళు పేలకుండా ఉంటుంది.
- కాలేయపు సమస్యలు రాకుండా గుప్పెడు బంగినపల్లి మామిడి గుజ్జుకు చిన్న చెంచాడు తేనెను కలుపుకొని మూడుపూటలా తాగండి. కాలేయపు సమస్యల్లో మామిడి గుజ్జును పాలతో కలిపి తీసుకోవాలి.
- వేసవితాపం భరించలేక వడదెబ్బకు గురయ్యేవారు పచ్చి మామిడికాయను చిన్న చిన్న ముక్కలుగా తరిగి ఒక గ్లాసు నీటిలో వేసి.. దాంట్లోనే కాస్త చక్కెర వేసి బాగా కలపాలి. కాసేపటి తరువాత ఈ ద్రవాన్ని తాగినట్లయితే వడదెబ్బ బారినుంచి బయటపడే అవకాశం ఉంది. అలాగే పచ్చి మామిడి ముక్కలపై కాస్త ఉప్పు వేసి తినటంవల్ల అధిక దాహాన్ని అరికట్టడమేగాకుండా.. చెమట ద్వారా శరీరంలోని లవణాలు, రక్తంలోని ఐరన్ తదితరాలు బయటకు పోకుండా ఆపుతుంది.
- వేసవిలో వచ్చే డయేరియా, రక్త విరేచనాలు, పైల్స్, వికారం, అజీర్తి, మలబద్ధకం లాంటి సమస్యలకు టెంక పూర్తిగా ఏర్పడని పచ్చి మామిడికాయను చిన్న చిన్న ముక్కలుగా చేసి

మధురమైన మామిడి తాండ్ర

తాండ్ర అనేది బంగినపల్లి మామిడిపండ్ల రసాలని ఆరబెట్టి తయారు చేసే తియ్యని పదార్థం తాండ్ర. మేంగో జెల్లీ అనే పేరుతో మంచి ప్రాచుర్యంలో ఇది ఉంది. ఈ తాండ్రని చెయ్యడానికి ఏ పండు రసమైనా వాడవచ్చు. కాని దీనిని ఎక్కువగా బంగినపల్లి మామిడి పండ్లతో చేస్తారు. పాశ్చాత్య దేశాలలో కూడ పండ్ల రసంతో తాండ్ర వంటి చిరుతిండిని చేసి అమ్ముతారు. కాని బంగినపల్లి మామిడి తాండ్రకి ఉన్న రుచి, ప్రాచుర్యం మిగిలినవాటికి లేవు.

మామిడి తాండ్రని మామిడి పండు రసం నుండి తయారుచేస్తారు. పొరలు పొరలుగా ఉండి పులుపు, తీపి సమ్మేళనంతో అత్యంత మదురంగా ఉంటుంది ఇది.

మామిడి రసాన్ని వెడల్పాటి అల్యూమినియం పళ్ళాలలో గాని, పెద్దవైన తాటాలు తట్టలలో గాని పొరలు పొరలుగా పోస్తారు. ఒక పల్చటి పొరలా రసాన్ని పళ్లెంలో కాని తట్టలో కాని పోసి, దానిని ఎండలో పెట్టి, అది గట్టి పడిన తరువాత మరొక వాయ రసం, మరొక పొరలా పోస్తారు. అలా కావలసిన మందం వచ్చే వరకూ పోస్తూ ఎండబెడుతూ పోతారు. ఈ తతంగం అంతా అవడానికి 2-4 వారాలు కాలం పట్టవచ్చు. బాగా ఎండిన తదనంతరం దానిని నలు చదరంగా ముక్కలు ముక్కలుగా కోసి అమ్మకానికి తీసుకువెళ్తారు.

అంతకు ముందు మామిడి పళ్ళను తొక్క తీసి మాగాయ పచ్చడికి తీసినట్టుగా పల్చని ముక్కలుగా కోసి టెంకలు పక్కన పెడతారు. ఇంట్లో చేసు కునేటప్పుడు రసాన్ని గిన్నెలోకి పిండుకుని చేసుకోవచ్చు. మామిడి ముక్కలను పెద్ద గ్రైండర్లలో పోసి మెత్తగా ఆయేవరకూ తిప్పి ఆరసాన్ని పెద్ద బానలలో తీస్తారు. చెక్కరగానీ, బెల్లంగానీ కలిపే ముందు కొందరు దానిని త్వరగా గడ్డకట్టేటందుకు నీళ్ళతో కలపి వేడి చేస్తారు. కొందరు గ్రైండింగ్ చేసేటపుడే చక్కెర కలిపి చేస్తారు. అలా వచ్చిన రసం పెద్ద పాత్రలలో బియ్యం జల్లెడలలో వేసి వడకడతారు వడకట్టిన రసం పెద్ద పాత్రలలోనే ఉంచి ఎండలో పెడతారు. పెద్ద అరపల మాదిరి తక్కువ ఎత్తులో పందిరి వేసి దానిపై చీరలు దుప్పట్లు వేసి వాటిమీద కొత్త తాటాకు చాపలు పరుస్తారు. పరిచిన చాపలను ఎత్తుపల్లాలు లేకుండా ఉండేలా రాళ్ళను పెట్టి చాపలపై నీళ్ళు కొడుతూ శుభ్రపరుస్తారు. చాపలు శుభ్రపడి ఎండిన తరువాత వాటిమీద కొంచెం చిక్కబడిన రసం మధ్యలో పోసుకు వెళతారు. చివరల వరకూ ఆఖరుగా పోస్తూ చేతులతో సరిచేస్తారు. చివరల వరకూ కారిపోకుండా చీరలను మడతపెట్టీ అడ్డుపెడతారు.

మళ్ళీ మళ్ళీ పొరలు పొరలుగా మామిడి రసం పోసుకు పోతారు. అది తగిన మందం అయినపుడు దాన్ని అనుకొన్న పరిమాణంలో ముక్కలుగా కోస్తారు. వాటిని ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి అమ్మకానికి ఇస్తారు. బంగినపల్లి మామిడితో తయారు చేసే తాండ్ర వేలాది కుటుంబాలకు కుటీర పరిశ్రమగా ఉపాధికల్పిస్తోంది.

వాటికి ఉప్పు, తేనెను కలిపి తింటే మంచి ఔషధంలాగా పనిచేస్తుంది.

- పచ్చి బంగినపల్లి మామిడికి మిరియాలు, తేనె కలిపి తిన్నట్లయితే.. జాండీస్ (పచ్చ కామెర్లు) వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు.
- మామిడి గుండెకు మంచి టానిక్‌లాగా పనిచేస్తుంది. పచ్చి మామిడికాయలో విటమిన్ సీ పుష్కలంగా లభిస్తుంది. గుండె కండరాలను బిగుతుగా చేసే శక్తి మామిడికి ఉంది. చర్మాన్ని మిలమిలా మెరిసేలా చేసే శక్తి కూడా దీనికి అధికంగా ఉంది.

ఇతర ఉత్పత్తుల్లో ..

మామిడి తాండ్ర ను చేసి చిన్నచిన్న బండ్ల మీద అమ్ముతూ ఉంటారు. ఇలాంటిదే పెద్దఎత్తున కొన్ని వ్యాపారసంస్థలు దేశం అంతటా విక్రయిస్తున్నాయి. మామిడి రసాన్ని సీసాలు, మరియు ప్యాక్ ల రూపంలో వ్యాపారసంస్థలు దేశం అంతటా విక్రయిస్తున్నాయి. మిల్క్ షేక్, లస్సీ పండ్ల రసాల అంగడి లో అమ్ముతుంటారు. మామిడికాయలతో చేసే ఊరగాయలు ఆంధ్రులద్వారా ప్రపంచం అంతటా లభిస్తున్నాయి. ఐస్ క్రీం లో బంగినపల్లి మామిడి గుజ్జును, ఫ్రూట్ సలాడ్ లో బంగినపల్లి మామిడి ముక్కలను వేస్తారు.

పోషక విలువలు పుష్కలం

బంగినపల్లి మామిడిపండ్లు ప్రపంచమంతా ఇష్టమైన ఆహారం. తాజా మామిడి పండులో పదిహేను శాతం చక్కెర, ఒక శాతం మాంసకృత్తులు, గణనీయంగా ఏ,బి,సి విటమిన్లు ఉంటాయి. ఈ మామిడిపండు ఎక్కువగా తియ్యగా ఉండి, కాయగా ఉన్న సమయంలో కూడా ఎక్కువ తియ్యగా కొంచెం పుల్లగా ఉంటుంది. అందువలనే భారతదేశంలో చిన్నచిన్న వ్యాపారులు వీటిని సన్నని పొడవైన ముక్కలుగా కోసి ఉప్పుకారం చల్లి బండిమీద అమ్ముతూ ఉంటారు. ఈ రకం మామిడి కాయలు ఎక్కువ తీయగా మెత్తటి కండ కలిగి ఉంటాయి. పిల్లలు, పెద్దలు వీటిని తినడానికి అమితంగా ఎగబడుతుంటారు. వీటిలో నీటిశాతం ఎక్కువ కనుక రసభరితంగా ఉంటాయి. ఈ కాయలతో ఎక్కువకాలం నిలవ ఉండే పచ్చళ్ళు (ఊరగాయలు) తయారు చేస్తారు. ఉత్తర భారతంలో ఈ మామిడి ముక్కలను పొడిచేసి ప్యాక్ చేసి అమ్ముతారు. దీనిని వారు విరివిగా వంటలలో వాడుతుంటారు. దీనిని వారు ఆమ్ చూర్ (మామిడి పొడి) అంటారు. ఆంధ్రులు కూడా కొన్ని ప్రదేశాలలో ఇళ్ళలో ఎండపెట్టిన మామిడి ముక్కలను (వీటిని మామిడి ఒరుగు అంటారు) ఏడాదంతా ఆహారంలో భాగంగా వాడుతారు. పచ్చి మామిడి కాయను వివిధ రూపాలలో వంటలలో వాడుతుంటారు. వీటిలో క్యాల్షియం, విటమిన్ బి పుష్కలంగా ఉంది. అమెరికా జనం వీటిని చెక్కుతో చేర్చి తింటారు. పడమటి దేశాలలో పండ్లతో తియ్యటి పచ్చడి చేస్తారు. ఫిలిప్పైన్ లో ఈ మామిడి కాయలను ష్రిమ్ప్ అనే చేపల గుజ్జుతో చేర్చి తింటారు. ష్రిమ్ప్ అనే చేపల గుజ్జుతో అక్కడ తీపి, ఉప్పు, మసాలా రుచులను చేర్చి ఇతర వంటల లో వాడుతుంటారు. పీచేస్‌పై అనే ఆహారాన్ని ఇప్పుడు మాంగో పై తో చేస్తున్నారు. థాయ్ లాండ్ లో భోజనానంతర ఆహారం (డిసర్ట్) తో బంగినపల్లి మామిడిపండు ముక్కల్ని చేర్చి అందిస్తారు.



బంగినపల్లి అంటుమామిడి

బంగినపల్లి మామిడి మొక్కలు వాటి టెంకలు (విత్తనాలు) నుంచి రావు. అంటు కట్టడం ద్వారా మొక్కలను ఉత్పత్తి చేస్తారు. "ట్రీ టాప్ (గ్రాఫ్టింగ్)" ద్వారా బంగినపల్లి మామిడిని తయారు చేస్తారు. ఇదెలా అంటే...? బాగా ఎదిగిన పెద్ద మామిడి చెట్టుకున్న పెద్ద కొమ్మలను కొట్టి వేయాలి. మూడు నెలలకు, కొట్టిన ప్రతి కొమ్మకు కొన్ని చిగుర్లు వస్తాయి. అవి చేతి వేలు ప్రమాణం వచ్చి నపుడు వాటిని సన్నటి పదునైన చాకుతో ఏట వాలుగా కోయాలి. మనకు కావలసిన అనేక రకాల మామిడి రకాల చెట్టు కొమ్మల నుండి చేతి వేలి లావున్న కొమ్మలను ఏటవాలుగా కోసి (నాలుగు అంగుళాల పొడవు) ఈ చెట్టుకు కోసిన కొమ్మలకు అతికించి గట్టిగా కట్టాలి. ఆవిధంగా అన్నికొమ్మలకు కావలసిన బంగినపల్లి కొమ్మలను అతికించి కట్టాలి. ఇలా మొక్కలు తయారౌతాయి. కొన్ని చోట్ల వేరే రకం మామిడికే అంటు కట్టడం ద్వారా కొన్ని కొమ్మల్లో బంగినపల్లి మామిడి కాయలు వచ్చేలా ప్రయోగాలు చేసి మంచి ఫలితాలను పొందుతున్నారు.





వంటల్లో కూడా బంగినపల్లి అదుర్స్

మామిడికాయల సీజన్ వచ్చిందంటే బంగినపల్లి రకంతో పచ్చి పచ్చడి, ఉరువు పచ్చడి, మామిడికాయ పప్పు, తియ్యమామిడి పులుసు, పులిహోర, వడ తప్పనిసరిగా వండుతారు. స్వీట్సులో అయితే బంగినపల్లి మామిడితో హల్వా, ఖీర్, బట్టర్ షేక్, యోగర్ట్ చేస్తారు.

ఇన్ని విశిష్టతలున్న బంగారం లాంటి బంగినపల్లి మామిడి పండంటే ఎవరికి ఇష్టం ఉండదు. అందరికీ అత్యంత అభిమాన ఫలమైన బంగినపల్లిని ఆస్వాదిద్దామా మరి!

మాస్కోకు సైక్లింగ్..!



కదలకుండా ప్యారిస్ నుంచి మాస్కో వరకు సైకిల్ తొక్కేశాడు ఫ్రాన్స్‌కు చెందిన 53 ఏళ్ల పాస్కల్ పిచ్. అదెలా! అని ఆశ్చర్యపోకండి. ఆయనేమి మాస్కోకు వెళ్లలేదు. అంత దూరం ఉండే 3000 కిలోమీటర్లను ఓ స్టేషనరీ బైక్ మీద ఆగకుండా సైక్లింగ్ చేసేసి రికార్డు సృష్టించేశాడు. ఆగకుండా ఆరు రోజుల పాటు సైకిల్ తొక్కేయగలడట. ఇప్పటి వరకు తాలిమి అదేనండి తట్టుకునే శక్తికి సంబంధించిన పోటీల్లో 10 ప్రపంచ రికార్డులను నెలకొల్పి సత్తా చాటాడు కూడా. రోజుకు రెండు గంటలపాటే నిద్రిస్తూ 600 కి.మీ.ల దూరానికి స్టేషనరీ సైకిల్‌ను



తొక్కాడు. గతేడాది ఈ రికార్డును 2878 కి.మీ.ల దగ్గర సెట్ చేశాడు. కెనడాకు చెందిన ఓ అథ్లెట్ పాస్కల్ సృష్టించిన రెండు రికార్డులను బద్దలు కొట్టాడనే విషయం తెలీడంతో స్టేషనరీ సైక్లింగ్ రికార్డును ఎవరూ టచ్ చేయకూడదనే ఉద్దేశంతో ఈ ఏడాది మళ్లీ ఆరు రోజుల్లో 3000 కి.మీ.లతో తన రికార్డును తానే సవరించుకున్నాడు. కూర్చుని తాపీగా తొక్కేయొచ్చంటానికి లేదు. ఎంత తొక్కినా ప్రదేశం మారడం లేదనే భావన మానసికంగా కొన్ని ఇబ్బందులను కలిగిస్తుంది. మనసును నియంత్రించుకోవడం ద్వారా వీటి నుంచి బయటపడ్డాడు. 3300 కి.మీ.లు లక్ష్యంగా అనుకున్నా చివరి ఫలితంతో ఓకే అనుకున్నాడు. మనోడికి ఫ్రాన్స్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. జూడోలో బ్లాక్ బెల్ట్ సాధించిన పిన్నవయస్కుడిగాను పేరుంది. 10 గంటలు ఈత, 10 గంటలు సైక్లింగ్, 10 గంటలు పరుగుతో ట్రయథ్లాన్ రికార్డులున్నాయి. పది ప్రపంచ రికార్డులతో డెకా ఐరన్‌మ్యాన్‌గా చాంపియన్‌గా నిలిచాడు.

వింత లోకం

నకిలీ బంధువులు

చైనాలో ఓ మాయలోడి పప్పులు ఉడకలేదు. డబ్బు కోసం వాడి బుద్ధిని పసిగట్టి త్రుటిలో కూతురి జీవితాన్ని కాపాడుకున్నారు తల్లిదండ్రులు. షాంక్సీ ప్రావిన్స్ గ్జియాన్‌లోని ఓ హోటల్‌లో వాంగ్ అనే అబ్బాయితో గ్జియోలి అనే అమ్మాయికి ఈ ఏడాది ఏప్రిల్ 30న పెళ్లి జరగాలి. కానీ అది రింగులు మార్చక ముందే ఆగిపోయింది. కారణం వాంగ్ తమ వాళ్లని చెప్పుకున్న బంధువులు, స్నేహితులు అందరూ నకిలీలే. ఓ సామాజిక మాధ్యమం ద్వారా తన పెళ్లికి బంధువులు, స్నేహితుల రూపంలో అతిథులుగా రావాలని 200 మందికి సందేశాలు పంపాడు. వచ్చిన వారికి ఓ వేయి రూపాయల వరకు నజరానా కూడా ఇస్తానని చెప్పాడు. విందు పసందుకు తోడు డబ్బు కూడానా భలే ఉందే ఆఫర్ అని చాలామంది వచ్చేశారు. వచ్చినవాళ్ల హావభావాలు, తీరు చూసి వీళ్లు నిజంగానే వాంగ్ బంధువులేనా అని సందేహం కలిగింది గ్జియోలీ తల్లిదండ్రులకు. వీరంతా వచ్చారు సరే ఇంతకీ పెళ్లి కొడుకు తల్లిదండ్రులేరి అని నిలదీశారు. అందరూ నీళ్లు నములుతుండటంతో అనుమానం మరింత బలపడి వాంగ్‌ను గట్టిగా అడిగారు. వాంగ్ తప్పించుకునే మాటలు చెబుతుండటంతో పోలీసుల్ని పిలిపించారు. అప్పుడు బయటపడింది తతంగం. కొసమెరుపు ఏమిటంటే వాంగ్‌కు చట్టప్రకారం ఇంకా పెళ్లీడు రాలేదు. అప్పటికే అమ్మాయి తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఆ పెట్టుబడికి, ఈ బహుమతికి అని దండిగానే లాగేశాడు. కట్నం కూడా బానే డిమాండ్ చేశాడు. పెళ్లయ్యాక ఆ డబ్బు చేతికందేది. కానీ అది జరగలేదు. వాంగ్‌తో గ్జియోలిది మూడేళ్ల స్నేహం. ఆ మధ్య పెళ్లి కుదిరేటపుడు తల్లిదండ్రులంటూ ఎవరితోనో మాట్లాడించాడట. వారు కూడా నకిలీలేమోననే అనుమానం గ్జియోలిది.

ఇదేం ముఖం?

పాశ్చాత్య జానపదాల్లో ఎల్ఫ్‌లనే వింత మనుషులు ప్రస్తావన ఎక్కువగా ఉంటుంది. చాలా హాలీవుడ్ ఫాంటసీ-ఎపిక్ సినిమాల్లో వీరిని హీరోలుగా కూడా చూపిస్తారు. లూయిస్ పాడ్రస్ అనే పాతికేళ్ల అర్జెంటీనా అబ్బాయికి ఈ సినిమాల పిచ్చి బాగా ఎక్కువ. అది ముదిరి తానే ఎల్ఫ్‌లా మారిపోవాలని చిన్నప్పటి నుంచి కలలు కనేవాడు. ప్లాస్టిక్ సర్జరీల ద్వారా తన రూపాన్ని ముఖం ఆకృతిని అస్సలు గుర్తుపట్టలేనంతగా మార్చేసుకున్నాడు. ఈ ముఖాకృతి కోసం లక్షల్లో డబ్బు ఖర్చుపెట్టేశాడు. హైస్కూల్ దాటక ముందే తన ముఖ మార్పును మొదలెట్టేశాడు. 20 ఏళ్లప్పుడు మొదటి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నాడు. ఇప్పటి వరకు 40 ఫిల్లర్లను, బొటాక్స్ ఇంజెక్షన్లను, దవడకు లైపోసక్షన్, ముక్కు, చెవులు ఆపరేషన్లను, లేజర్‌తో చర్మం బ్లీచింగ్‌ను చేయించుకున్నాడు. అయినా తృప్తి లేక కంటి రంగును 'క్రిస్టల్ బ్లూ'కి మార్చే ఆపరేషన్ కూడా జరిపించుకున్నాడు. ఇది వైద్యపరంగా అనుమతి లేనిది అయినా రిస్క్ తీసుకున్నాడు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడానికి మరో నాలుగు సెషన్లకు వెళ్లాలి. ఇవే కాదు ఎత్తు పెరిగేందుకు, నడుము చిన్నగా కనిపించేందుకు మరిన్ని ప్రమాదకర ఆపరేషన్లను చేయించుకోవాలని ప్లాన్‌లు వేసుకున్నాడు. ఎల్ఫ్‌లా కనిపించాలనే ఉన్మాదం అతడికి ప్రాణాంతకం కావొచ్చనేవారున్నారు. లూయిస్‌ది వేపకాయంత వెర్రి కాదు పుచ్చకాయంత పిచ్చి అనాలేమో..!



చల్లని తల్లి

మనదేశంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్య నీటి కొరత. నీటి సమస్యల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇక వేసవిలో గుక్కెడు నీళ్ల కోసం అల్లాడుతుండే గ్రామాలు, బీటలు బారిన సాగుభూములు ఇవన్నీ రాజస్థాన్‌లో ఒకప్పటి చిత్రాలు. ఇప్పుడు ఆ పరిస్థితుల్లో మార్పు తెచ్చింది అమలా రుయా. రాజస్థాన్‌లోని వందకిపైగా గ్రామాల్లో మూడు పంటల్ని పండించగలుగుతున్న రాజస్థాన్ రైతుల ఆర్థిక స్థిరత్వానికి దోహదపడిన అమలా గురించి మీరూ తెలుసుకోండి.

అమలా రుయా ముంబయికి చెందిన ఒక సామాజిక కార్యకర్త. 1999లో ముంబై ప్రముఖ దిన పత్రికలన్నీ వర్షాభావం వల్ల తీవ్ర కరువు ఎదుర్కొంటున్న రాజస్థాన్ రైతులపై వార్తలని ప్రచురించాయి. ముఖచిత్రాలుగా వచ్చిన ఆ ఫోటోలన్నీ అమల గుండెని మెలిపెట్టాయి. అప్పుడే అక్కడి ప్రజలకి తన వంతు సాయమందించాలనుకుంది అమల. అనుకోవడమే కాదు కొద్దిరోజుల్లోనే ఆక్కడికి చేరిపోయింది. అప్పటికి ప్రభుత్వం నీటి ట్యాంకర్ల ద్వారా గ్రామస్తులకి నీటిని సరఫరా చేస్తున్న దృశ్యాలు కనిపించాయి. ఇది తాగునీటి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి. సాగునీటి కోసం ప్రత్యామ్నాయ పద్ధతులే తప్ప శాశ్వత పరిష్కారం గురించి ప్రస్తావనే లేదు. అలాంటి సమయంలో అమల చేసిన ఒక అద్భుతమైన ఆలోచనే చెక్ డ్యామ్. నీటిని అదుపు చేసేందుకు ఉపయోగించే చిన్న రాతినిర్మాణాలే ఇవి. వీటిని స్థానికంగా ఖాదిన్ అంటారు. ఎత్తైన కొండల నుంచీ జాలువారే జలధారలు వృధా కాకుండా రిజర్వాయిర్లలోకి మళ్ళించేందుకు చెక్ డ్యామ్‌లు ఉపకరిస్తాయి. నీటిని అదుపుచేసేందుకు ఉపయోగించే చెక్ డ్యామ్‌ల నిర్మాణ ఖర్చు కూడా తక్కువే. సాగునీటి కొరతని తీర్చే చెక్ డ్యామ్‌లని నిర్మించాలనుకున్న తన ఆలోచనకి రాజస్థాన్‌లోని మందవార్ గ్రామంలో బీజం పడింది. ఆక్కడ నిర్మించిన రెండు చెక్ డ్యామ్‌ల ద్వారా వ్యవసాయం పట్ల రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. రైతులు ఏడాదిలోపే పన్నెండు కోట్ల ఆదాయాన్ని గడించారంటే చెక్ డ్యామ్‌లు ఎంతగా ఉపయోగపడ్డాయో అర్థం చేసుకోవచ్చు. అకార్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) ద్వారా వివిధ గ్రామాల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణాలని చేపట్టారు అమల. ఒక్కో డ్యామ్ నిర్మాణానికి ఐదు లక్షలు ఖర్చవుతుంది. వాటి విస్తీర్ణాన్ని బట్టీ ఖర్చులో కొన్ని మార్పులుంటాయి. నిర్మాణ వ్యయంలో నలభై శాతం డబ్బుని రైతులే

సమకూర్చుకుంటారు. మిగిల డబ్బుని ట్రస్ట్ సమకూర్చుకుంటుంది. మూడునెలల్లో వీటి నిర్మాణాన్ని పూర్తి చేస్తారు. రుతుపవనాలు మొదలయ్యే నాటికల్లా రైతులకి సాగునీటిని అందించేలా ప్రణాళికని తయారుచేసుకుంటారు. ప్రస్తుతం రాజస్థాన్‌లోని దాదాపు 200 గ్రామాల్లో ఈ చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు జరిగాయి. ఇదంతా యాక్ట్ ట్రస్ట్ వలంటీర్ల ద్వారా సాధ్యపడిందంటారు అమల. ఎందుకంటే గ్రామస్తుల్లో డ్యామ్‌లపై అవగాహన కల్పించడంతోపాటు స్థానిక పెద్దలతో నిర్మాణాలకి సంబంధించిన చర్చలు జరిపేది కూడా వలంటీర్లే. స్థానిక రైతుల సహకారంతో ఏర్పాటుచేసిన డ్యామ్‌ల ద్వారా నిల్వ చేసిన నీరు ఏడాది పొడవునా వ్యవసాయపనులకి ఉపయోగపడుతోంది. సంవత్సరం మొత్తంలో ఒక్క పంటని సాగుచేయడమే భారమనుకునే పరిస్థితుల్లో మార్పు వచ్చింది. రైతులందరూ ఏడాదిలో రెండు మూడు పంటలని సాగుచేసుకోగలిగారు. ఈ నిర్మాణాల ద్వారా కూరగాయల సాగుతోపాటు రైతులు మొదటి సారి రబీ పంటలని కూడా సాగుచేసారు. కొందరు పశుపోషణని కూడా ప్రారంభించారు. ఇది రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు మరింత అండగా నిలిచింది. పొలం పనులకి సొంత ట్రాక్టర్లని కొనుగోలు చేశారు. ఇదంతా అంత సులువుగా ఏం జరగలేదు. ప్రభుత్వం నుంచి చాలా సార్లు వ్యతిరేకతని ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే స్థానికుల అండతో తన ప్రాజెక్ట్‌ని మరింత ముందుకు నడిపించగలిగారు. అమల సంకల్పంతో రూపుదిద్దుకున్న చెక్ డ్యామ్‌లు తాగునీటి సమస్యనీ తీర్చగలిగాయి. నీటి కోసం మైళ్లదూరం వెళ్లే మహిళలందరూ తమ ప్రాంతంలోనే మంచి నీటిని పొందగలుగుతున్నారు. చెక్ డ్యామ్‌ల ద్వారా మంచినీటి సమస్యలకి చెక్ పెడుతున్న అమల రుయా ఆలోచన ఇప్పుడు మరిన్ని ప్రాంతాల్లో మార్పుతేనుంది. చత్తీస్‌గఢ్ దంతేవాడ ప్రాంతంలో ఇప్పటికే డ్యామ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

తెలుగు సినిమా స్వర్ణ యుగానికి అంకురార్పణ విజయ వాహినీ స్టూడియో నుంచే ఆవిర్భవించింది అనడం అతిశయోక్తికాదు. అక్కడ ఆకుల కదలిక మాట్లాడుతుంది. ఆకుపచ్చని పూదోటలు కథలు చెబుతుంటాయి. గాలి పాటలు పాడుతుంది. ఆ ప్రాంగణంలోకి అడుగుపెట్టడమే గగనం కట్టుదిట్టమైన ఏర్పాట్లు. అనుమతి లభించి అడుగు పెడితే ప్రతి అడుగూ కళాత్మకమే అది ఒక కళానిలయం! ఆ ఆలయానికి అధినేత మూలానారాయణ స్వామి. ఆయన ద్వారా1947లో విడుదలైన ఈ చిత్రం ఇప్పటికి ఏడుపదుల వసంతాల్ని పూర్తి చేసుకుంది.

యోగి వేమ

నారాయణస్వామి భావుకుడు. దేనికైనా మూలాలు వెదికి సాధికారికంగా చెప్పగల సమర్థుడు! ఆయనకి అంతేవాసి కళాతృష్ణగల నిర్మాతాదర్శకుడు బి.ఎన్.రెడ్డి. వారే మొట్టమొదటి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత! ఇద్దరు కళల్ని గురించి కలలుగంటున్న వ్యక్తులకలయిక ఎలా వుంటుంది? కళాత్మకంగా వుంటుంది. వారి మాటలు శిలాశాసనాలు! వారి చేతలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకాలు! వారి ఆలోచనల ఫలితమే 'యోగి వేమన' చిత్ర ఆవిర్భావం!

యోగి వేమన చిత్రం మొదలు పెడితే ఎలా వుంటుంది? ఈ ఆలోచన రాగానే కదిరి వెంకట రెడ్డి ....అంటే కె.వి రెడ్డి అప్పట్లో స్టూడియోవ్యవహారాలు చూస్తుండేవారు. నాగిరెడ్డి,చక్రపాణి బృందం కూర్చున్నారు. నారాయణ స్వామిగారి ప్రతిపాదనకి కే.వి. రెడ్డి గారు స్పందించారు. చక్రపాణిగారు తెలివిగా యోగివేమన మనప్రాంతానికి చెందిన వాడనో..మన కులానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వాడనో సినిమా తీయగూడదు అన్నారు. అయినా ఇది సొమ్ములతో వ్యాపారం. రూపాయిలు, చిల్లిపైసలేరుకోవాలి. పైగా వేమనకి సంబంధించిన ఆధారాలు ఇవి అని చెప్పడానికేంలేవు.ఒకటీ అరా వున్నా అవి చాలవు. ఈ ప్రయత్నం గురించి మరోసారి ఆలోచించండి! అని తెలివిగా తప్పించుకున్నాడు. చక్రపాణిగారు ఎంతచెబితే అంతే! నాగిరెడ్డిగారూ చక్రపాణిగారితో ఏకీభవించారు. ఇది కె.వి.రెడ్డి గారికి చెంపపెట్టులా అనిపించింది. కె.వి రెడ్డిగారు గంభీరంగా వుంటారు. ఆయన ఆలోచనలు ఉన్నతంగా వుంటాయి. ఆయన ఎవరికైనా మాట ఇచ్చినా... పొరపాటున మాట జారినా వెనక్కి తీసుకొనే తత్వం కాదు. బ్రతికినంత కాలం అలాగే బ్రతికాడు. కె.వి రెడ్డి గారి పట్టుదల చూసి బి.యన్ రెడ్డిగారు 'సరే! నారాయణస్వామి గారితో కలసి నేనూ ఈ సినిమాకి నిర్మాతగా వ్యవహరిస్తాను రెడ్డిగారూ' అన్నాడు దర్శకుడు కె.వి రెడ్డితో. మీ ప్రయత్నాలు మీరు చేయండి! అంటూ శుభం పలికారు. ఆస్థాన కవిగారు సముద్రాల రాఘవాచార్య గార్ని పిలిపించి విషయం చెప్పారు. ఎగిరి గంతేశారు సముద్రాల వారు. ఆయనకి ఇష్టమైన సబ్జక్టు.

వజ్రసంకల్పం

ఈ పదం ఎందుకు ఉపయోగించాల్సి వచ్చిందంటే దర్శకుల్లో అసోసియేట్లూ, కోలూ, ఎగ్జిక్యూటివ్‌లంటూ ఎవరూ వుండే వారు కాదు. అందరూ సహాయ దర్శకులే! అందరికీ ఆంగ్ల ఆంధ్ర మాధ్యమాల్లో విషయమున్న వారే. కమలాకర కామేశ్వరరావు గారు బిఏ పూర్తి చేసిన తర్వాత కృష్ణపత్రిక ద్వారా సినిమా సమీక్షలు రాస్తుండేవారు. అవి ఘాటుగా సూటిగా వుండేవి. బి.యన్. రెడ్డి గారు పిలిపించుకుని వాహినీ స్టూడియో చిత్రాలకి సహాయకుడిగా పనిచెయ్యమని ఆఫర్ ఇచ్చి కె.వి రెడ్డిగారికి పరిచయం చేశారు. తొలి పరిచయమే కమలాకర వారి మీద రెడ్డిగారికి గురి కుదిరింది. చర్చలు ప్రారంభమయ్యాయి. సముద్రాల కమలాకర, లింగమూర్తిగారు, లింగమూర్తి, ఆ రోజుల్లో ప్రోగ్రెసివ్ ఆలోచనలున్న గొప్ప పత్రికా రచయితలు. వేమన

జననమరణాల మీద వేమన జీవనగమనం మీద, వేమన సంసారిక జీవితం మీద ఆపై వేశ్యాసాంగత్యం...తదుపరి పరివర్తన ..యోగిగా మారడం ఇలా పడక్బందీగా ఒక ఆర్డరు వచ్చేసింది. విశ్వదాభిరామ వినురవేమ మకుటం ఆధారంగా తీసుకుని కథలో అంతర్లీనంగా పాత్రలని రూపుదిద్దారు. యోగి వేమన స్క్రిప్ట్ బౌండ్ బుక్ తయారయ్యింది. మిగతావారిమాటేమిటి? నటీనటులెవరు? సాంకేతిక నిపుణులెవరు? పెట్టుబడి ఎంతవుతుంది. ఈ డబ్బు అయిదేళ్లకైనా తిరిగి వస్తుందా? అప్పట్లో అలాగే ఆలోచిస్తూ వుండేవారు. కాకపోతే డబ్బు పోయినందుక్కాదు... నలుగురిలో నవ్వులపాలయిపోతామే... ఎన్నో ఆలోచనలు. కె.వి రెడ్డి గారు స్థిర చిత్తంతో మీకా భయం అక్కర్లేదు. ఈ సినిమాకి డబ్బు వస్తుంది. పేరూ వస్తుంది. చరిత్రలో నిలబడిపోతుంది అంటూ భరోసా ఇచ్చారు.



నటీనటులూ-సాంకేతిక నిపుణుల ఎంపిక

లింగమూర్తిగారు కమలాకర మంచి స్నేహితులు. ఇద్దరికీ భావసారూప్యం వుంది. లింగమూర్తికీ వి. నాగయ్యగారికీ మధ్య మంచి అనుబంధం వుంది. వారికి భావసారూప్యం వుంది. వారు బతికినంత కాలం బావ అంటూ పిలుచుకునే వారు. వీరితో బాటు మరో గొప్ప పాత్రికుడు ఇంటూరి వెంకటేశ్వరరావు. ఆయనకి మొదట్లో సినిమాల మీద వ్యామోహం వుండేది. సంగీత సాహిత్యాలో ప్రవేశముంది. వారు ఈ సినిమాకి పనిచేశారు. సరే! ఆస్థాన కవి ఆయనే రాస్తే పోలా! అన్నారు రెడ్డి గారు. నాగయ్య గార్ని పిలిపించారు. కథ వినిపించారు. ఈ విషయం ముందే లింగమూర్తిగారి ద్వారా తెలుసుకున్న నాగయ్యగారు బౌండుబుక్‌ని అందుకున్నారు. ప్రొడక్షను వ్యవహారాలన్నీ వాహినీ స్టూడియోస్ సిబ్బందే చూసుకున్నారు. కెమెరా పనితనం బావుండాలి. ఇంకెవరు? మార్కస్ బార్ట్లే అయితే సరిపోతాడు. మరి సంగీతం? ఓగిరాల రామచంద్రరావు

అనుకున్నారు. ఆయన న్యాయం చేయగలడా? అనుమానం. ఆ వెలితి కనిపిస్తే సంగీతంలో కర్ణాటక, హిందుస్థానీ సంగీతంలో పట్టున్న వమ హీరో నాగయ్య గారు వుండనే వున్నారు. ఇంకేం భయం? లింగమూర్తి గారి ఆశావాదం వినిపించారు. అందుబాటులో నటీనటులను తీసుకున్నారు. నాగయ్య, లింగమూర్తి, ఎం.వి. రాజయ్య ప్రధాన పాత్రలు తదితర పాత్రలకు



న ఓ కళాఖండం

దొరస్వామి సురభికమలాబాయి, బేబీ కృష్ణవేణి, బెజవాడ రాజారత్నం చిన్న నటుడు పద్మనాభం ఇలా నటీనటులు సెట్టయ్యారు. వాహినీ స్టూడియోలోనే మూలావారి ఆధ్వర్యంలోనే బి.ఎన్ రెడ్డి గారి అండదండలతో సినిమా ప్రారంభమయ్యింది. అప్పట్లో చమకులు వినిపించేవట... వేమన కథలో ఓ డైలాగ్ వుంటుంది. 'బంగారం కొనుగొన్న వాడు బైరాగి అయిపోతాడు' అని. దానికి పేరడీగా యోగివేమన సినిమా తీసేవాళ్లు యోగులైపోతారు. అంటుండేవారట. అన్నీ



దిగమింగారు కె.వి.రెడ్డిగారు. పట్టుదల మరింతగా పెరిగింది. యోగివేమన సినిమాని ఒక దీక్షలా పూర్తిచేశారు.

సంగీతం నాగయ్యకి తప్పనిసరి

యోగి వేమన గొప్ప సంగీతస్రష్టే. స్వరాలూ పద్యాలూ ప్రజల్లోకి వెళ్లడానికి క్యాచీగా వుండాలి. పైగా కె.వి రెడ్డిగారు మంచి మ్యూజిక్ లవర్. మంచి ఆర్ట్ లవర్. వింటూ ఏది గొప్ప మ్యూజిక్కో చెప్పేయగలరు. చూస్తూ ఏది గొప్ప నటనో ధృవీకరించగలరు. కె.వి రెడ్డి గారు ఆమోదముద్ర వేశారంటే రాజముద్ర వేసినట్లే...దీంతో నాగయ్యగారి ప్రమేయం తప్పనిసరైంది. ఓగిరాలవారు అభ్యంతరం చెప్పలేదు. యోగి వేమనలో ఓ పాట వుంటుంది. వేమన అన్నకూతురు. జ్యోతి. ఆమె చిన్నాన్న కోసం కుమిలిపోతే, ప్రాణప్రదంగా చూసుకున్న జ్యోతిని చూస్తూ పాడిన పాట. 'అందాలుచిందేటి నా జ్యోతి. ఆనందమొలికించు నా జ్యోతి'. నాగయ్యగారు స్వరపరిచిన ఆయనే పాడిన పాట. సముద్రాల రచన ఆ రోజుల్లో గొప్ప సూపర్ హిట్ సాంగ్. అది విన్న రెడ్డిగారు మిగతా పాటలనీ ఆయన్నే చేయమన్నారు. దాదాపు పన్నెండు పాటలకూ నాగయ్యగారే స్వరరచన చేశారు. కొన్ని పాటలు ఎం.వి. రావమ్మ , నాగయ్య ఒక పాట ఘంటసాల మాస్టారు అన్ని పాటలూ పద్యాలూ నాగయ్య పాడారు. అప్పట్లో యోగి వేమన ఆల్బమ్ పెద్ద సూపర్ హిట్. సినిమాలో ఓగిరాల రామచంద్రా రావు గారి పేరూ వుంటుంది. అది నాగయ్య గారు ఆసక్తికనపరిచారు. ఫీల్ ఎక్కడా మిస్సవ్వకూడదని ఆయన భావన. రీరికార్డింగ్ అంటే సినిమాకి డిస్టర్బెన్స్ అనే భావనలో వుండేవాడు. ఇప్పుడు రీరికార్డింగే రికార్డింగ్ కంటే ప్రముఖ పాత్ర వహిస్తోంది. పైగా మా ఆర్. ఆర్‌కి ఎన్ని కోట్లయ్యాయని గొప్పగా చెప్పుకుంటున్నారు. ఎవరికీ పెద్ద పారితోషికాలు లేవు. సముద్రాల వారి ఆబ్లిగేషన్ ఘంటసాల మాస్టారు, నాగయ్య ఎం.వి. రాజయ్య అప్పట్లో మంచి స్నేహితులు.

సినిమా కథ కమామిషూ

అప్పటికి అందరికీతెలిసిన కథే అయితే జనన మరణాలు ఇప్పటికీ అనుమానమే.. రాళ్లపల్లివారు చెప్పలేదు. పరిశోధకులూ ధృవీకరించలేదు గనుక దర్శకుడు తెలివిగా ఆ విషయాల జోలికి వెళ్లకుండా వేమన చుట్టూ కథని తిప్పాడు. అన్నయ్య వదిన సంస్థానం. అన్నయ్య కూతురు జ్యోతి–జ్యోతి ఎలా పసిదో వేమన కూడా అలాగే పసివాడు. పసిడి మనసున్న వాడు చిన్నప్పట్నించీ హేతువాదం. ఒక విషయాన్ని గురించి క్షుణ్ణంగా తెలుసుకొనే వరకు దాన్ని వదిలిపెట్టే ఘటం కాదు. అన్వేషి ఎప్పుడూ అన్వేషే....ఏదో తెలియని అన్వేషణ. బాధ్యతలు మరిచి స్నేహితుడు అభిరాముడితో అల్లరిచిల్లరిగా తిరుగుతూ వేశ్యప్రేమలో పడతాడు. పీకల్లోతు ప్రేమలో కూరుకుపోతాడు. ఆమె వేమన వదిన మెళ్లో వున్న హారాన్ని ఇవ్వమని కోరుకుంటుంది. వేమన చిక్కుల్లో పడతాడు. చివరికి దొంగతనం చేసి ఆనక 'విశ్వద'

వేశ్యకి ఇచ్చి ప్రేమైక్యప్రపంచంలో మునిగిపోతాడు. దొంగతనం చేసిన భయం వేమనలో వుండి పోతుంది. ఒకరోజు వదినకి దొరికిపోతాడు. తల్లిలా చూసుకొనే వదిన అడిగిన ప్రశ్నలకు తలదించుకుంటాడు. అభిరాముడి సహాయంతో బంగారం కనుక్కొన వచ్చు అని రాత్రింబవళ్ళూ పరశువేదితో ప్రయోగాలు చేస్తాడు. జ్యోతి చిన్నాన్న మీద దిగులుతో మంచం పడుతుంది. చివరిచూపులు నోచుకుంటాడు జ్యోతి దక్కదు. స్మశానంలో ఏదో సంఘర్షణ. మౌనంగా వుండిపోతాడు. ఒంటిమీద వస్త్రం కూడా మాయ అని తెలుసుకుని చిన్న పీలికతో సరిపెట్టుకుంటాడు. నాభిలోతుల్లోంచి వచ్చే నగ్న సత్యాలు ఆశు వుగా చెబుతాడు. అవే వేమనపద్యాలు. తెలుగు నాట విస్తృత ప్రచారాన్ని పొందుతాయి. మేవన యోగిగా మారిపోతాడు. వేమన సజీవసమాధి అవుతాడని తెలిసి అన్నయ్య, వదిన వస్తారు. అభిరాముడూ వస్తాడు. అందరి దగ్గరా శెలవు తీసుకొని బిలంలోకి వెళ్ళిపోతాడు ఇదీ కథ!

చిత్తూరు.వి.నాగయ్య విశ్వరూపం

వేమన హుషారుగా వుండే పాత్ర ఔచిత్యం చెడకుండా ఎంతగొప్పగా చేశాడో...పరివర్తన వచ్చిన తర్వాత ముఖ్యంగా పరశువేది బంగారం తయారు చేసినప్పట్నించీ నటన పరాకాష్టకి వెళ్లిపోయింది. శ్మశానంలో జవాబులేని ప్రశ్నలు. ఆశువుగా కవిత్వం. అన్నీ వేమన పేరుపొందిన పద్యాల్నే ఉపయోగించారు. చివర్లో అన్నా వదిన వస్తారు. వేమనని బిడ్డలా చూసుకున్న అన్నా వదినలు ఉక్కిరిబిక్కిరై దు:ఖపడుతున్న వదినని తలనిమిరి కృతజ్ఞతగా చూసే దృశ్యం. ఇవన్నీ ఇప్పటికీ కళ్లముందే నిలుస్తాయి. అభిరాముడు కడసారి చూపుకోసం వేమన కౌగిలిలో బంధీ అయిపోయి కన్నీరు మున్నీరుగా ఏడుస్తాడు. అభిరాముడిని అక్కున చేర్చుకున్న సన్నివేశం ఒక హైలెట్. విశ్వమానవాళికి అభివందనం తెలుపుతూ బిలంలోకి వెళ్లే సన్నివేశం చిత్రీకరిస్తున్నప్పుడు కె.వి రెడ్డిగారితోపాటు యూనిట్ అంతా ఏడ్చేసిందట.

చప్పట్ల వర్షం కురిసింది. అభినందిద్దామంటే నాగయ్య స్మృహలో లేడు. పరకాయ ప్రవేశం చేశాడు. పాత్రలో సొమ్మసిల్లి పోయాడు. సినిమా విడుదలైంది. సంచలన విజయం సాధించింది. విమర్శించిన వారు తలవంచి సలాం చేశారు. కె.వి రెడ్డి, చిత్తూరు వి.నాగయ్య చిరస్మరణీయులు. డెభై సంవత్సరాల తరువాత ఇప్పుడు చూసినా ఈ చిత్రం అంతే ఆసక్తికరంగా వుండటం కృషికి తగిన ఫలితం. ప్రపంచవ్యాప్తంగా యోగి వేమన చిత్రాన్ని భద్రపరుచుకున్న సినీ ప్రేక్షకులెందరో!.

- ఇమంది రామారావు

9010133844

"నువ్వింతే...!" నువ్వింతే...!

జాతిరాళ్ళ పగుళ్ళపై
మేథో వలసపక్షుల రెక్కలపై
వివక్షతా శరాల్నెక్కుపెడుతూ
ఇనప తెరల మాటున
ఉక్కు సామ్రాజ్యపు పునాదుల్ని నిర్మిస్తావ్
మానవతను డొల్లబరుస్తూ
ఉన్మాదానికి ఉత్ప్రేరకమై
ఉగ్రవాదానికి అగ్రస్థానమిస్తూ
ప్రపంచపెద్దన్న ఫోజుతో
మసకబారిన దర్పణమౌతావ్
ప్రపంచ పటాన్ని పిడికిట బంధిస్తూ
వసుధైక కుటుంబ నినాదాన్ని హెూరిత్తిస్తావ్
గడ్డిపరకలన్నీ...గజరాజుని బంధించినట్టు
భగ్గుమన్న దేహాలన్నీ....దేశాల సమూహమై
దిగ్గున నిను నిలువరించక పోతాయా...?

-ఇల్ల.ప్రసన్న లక్ష్మి
9494165632

మనసు బావుటా

తరచి చూసిన తెరచి చూసిన
ఒంటరితనాల డొల్లతనాన్ని
ఆరాటాల ముసుగుతో కప్పేస్తూ
ఎవరికి వారు
పరామర్శలకై పడిగాపులతో
అస్తిత్వాల ఆరాటాలతో
గుర్తింపుల పోరాటాలతో
నిరంతరం సమరం చేస్తుంటే..
నేను మాత్రం
నీ అనురాగపు సౌధంలో
నిరంతరం సంతోషాల దర్బారులో
నీ తలపులలో లోన కురుస్తున్న
ఆనందాల జడివానలో
కొత్త కొత్త చిగుర్లేస్తున్న
మనసు బావుటా ఎగరేస్తున్నా....

-కళ్యాణదుర్గం స్వర్ణలత
9848626114

కుటుంబంతో గడపండి

- ప్రజలు, సమాజం, కుటుంబం సంస్కృతి మధ్య సంబంధాలని పటిష్టపరిచే దిశగా ప్రతిసంవత్సరం మే -15న అంతర్జాతీయ కుటుంబాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.
- కుటుంబ బంధాలు, ఆప్యాయతలని బలపరుచుకునేందుకు కుటుంబ సభ్యులందరూ కలసి చేసుకునే ఓ వేడుక ఫ్యామిలీ డే.

- ఈస్టర్ పండుగ తర్వాత వచ్చే సోమవారాన్ని ఫ్యామిలీ డేగా జరుపుకునేవారు.
- అయితే ఫ్యామిలీ డే అనే పేరును స్థిరపరిచింది మాత్రం 1994లోనే.
- మొట్టమొదటి 'ఫ్యామిలీ డే' ఈస్టర్ సోమవారాన్ని 1910 నిర్వహించారు.
- 18 ల
- ప్రపంచవ్యాప్తంగా 63శాతం మంది పిల్లలు తల్లితో చనువుగా వుంటారనేది ఓ నివేదిక.

- ఎక్కువ సమయం ఉద్యోగాల్లో గడుపుతున్న కుటుంబాల సంఖ్య 2014 నాటికి (87.71) గణనీయంగా పెరిగింది.
- పిల్లల ఒంటరితనానికి కారణం తల్లి దండ్రులు ఎక్కువ పని గంటల్లో మగ్గడమే.



- దక్షిణ ఆఫ్రికాలో తల్లిదండ్రులతో కలిసున్న పిల్లల సంఖ్య నలభైమూడు శాతంగా వుంటే ముప్పై అయిదు శాతం మంది పిల్లలు కేవలం తల్లి సంరక్షణలో పెరుగుతున్నాను. తండ్రి వద్ద పెరుగుతున్న వారు రెండు శాతం మంది.
- 56 శాతం మంది టీనేజర్లు ఎక్కువగా ఇష్టపడే ప్రదేశం తమ ఇల్లే.



- వారానికి రెండు రోజులు కూడా కుటుంబంతో కలసి ఉండని టీనేజర్లు మత్తు పదార్థాలకి అలవాటుపడుతున్నారనేది ఓ సర్వే నివేదిక.
- కెనడాలోని అల్బర్టా ప్రాంతంలో తొలి ఫ్యామిలీడే వేడుకలని నిర్వహించారు. అల్బర్టా లెఫ్టినెంట్ గవర్నర్ 1990లో ఫ్యామిలీ డే చట్టాన్ని ఆమోదించడంతోపాటు ఫిబ్రవరిలో రెండో సోమవారం ఫ్యామిలీ డేగా ప్రకటించారు. అప్పటి నుంచి అక్కడ ఫ్యామిలీ డే 'అల్బర్టా ఫ్యామిలీ డే'గా ప్రచారంలోకి వచ్చింది.
- కుటుంబ విద్య-శ్రేయస్సు థీమ్‌తో ఈ ఏడాది ఫ్యామిలీ డే వేడుకలని నిర్వహించనున్నారు.



- మే 15 అంతర్జాతీయ కుటుంబ దినోత్సవంగా యుఎన్ జనరల్ అసెంబ్లీ ద్వారా 1993లో గుర్తించబడింది.

- సంతోషకరమైన వాతావరణంలో జీవిస్తున్న పిల్లల్లో 2.5 శాతం మంది అత్యంత ఆనందంగా వుండడానికి కారణం వారు ఎక్కువగా తల్లిదండ్రులతో మాట్లాడుతుండడమే అనేది ఒక నివేదిక.

కథ



స్థానబలిమి

- మంగ రత్నం
9701426788

అవి నేను రెవిన్యూ ఇన్స్పెక్టర్‌గా పనిచేసే రోజులు. నా సీటుకి. ప్రతిరోజూ చాలా టపాలు వస్తూ ఉండేవి. అందులో భాగంగా ఓరోజు సీనియర్ అసిస్టెంట్ ఓ కాగితం చేతిలో పెడుతూ 'అర్జంటు' అన్నాడు.

అది ఓ రైతు దరఖాస్తు. కేసారం గ్రామంలో. ధర్మారావు అనే అతను తన భూమిలోంచి 'పుంత' అంటే .. 'దారిమార్గము' లేదని సర్టిఫికేటు ఇప్పించవలసిందిగా కోరాడు. దరఖాస్తును పరిశీలించి అర్జంటు అన్నారు కదా అని ఫైలు తెప్పించుకుని చూసాను.

సర్వేయరు 'పదిహేను లింకులు'ల 'దారిమార్గం' ఉంటుందని, అది సర్వే రిజిస్టర్లో చుక్కల రూపంలో గుర్తించబడి ఉంది అని రిపోర్టు ఇచ్చాడు. గ్రామాధికారి మాత్రం .అడంగలు ప్రకారం 'అటువంటిది' ఏమీలేదని రిపోర్టు ఇచ్చాడు.స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం భూ స్వభావాన్ని, స్వరూపాన్ని, బట్టి, సర్వే బౌన్డరీస్ చట్టం చేసింది. ఆ నిబంధనలను అనుసరించి దాని ప్రకారం భూస్థితి ఎప్పటికీ మారకూడదు. అంటే ... సర్వే చేసిన రోజు నుంచి ఈ రోజుకీ అలాగే ఉండాలి. ఇద్దరి రిపోర్టులు వేరువేరుగా ఉండడంతో నాకు రాసారు మా ఆఫీసరు గారు.

దానికి సంబందించిన డాక్యుమెంట్లు తెప్పించాల్సిందిగా ఆ గ్రామాధికారికి ఫోన్ చేసి చెప్పాను. రెండు రోజుల తరువాత ఆ గ్రామాధికారి 'దానికి సంబందించిన డాక్యుమెంట్లు ఎక్కడున్నాయో కనిపించడం లేదటండి. బ్యాంకులో ఉన్నాయెా ఏమో! వెతకాలని అన్నారు దొరగారు' అన్నాడు.

" కనిపించకపోతే మనమేం చేస్తాం. బ్యాంకులో ఉంటే అవసరానికి తెప్పించాలి. డాక్యుమెంట్లు చూడకుండా ఎవ్వరికీ ఏ సర్టిఫికేట్లు ఇవ్వలేం. భూమి చాలా విలువైనది. అవతలి వాళ్ళు అర్జంటు అన్నారని ఏదో ఒకటి వ్రాసి ఇచ్చేయ్యలేం " అంటూ పరిస్థితి వివరించి ఆ విషయం అంతటితో వదిలేసాను.

అవసరం వాళ్ళది వాళ్ళే వస్తారు అనుకుంటూ.

పది రోజుల తరువాత సూపరిండెంటు గారు పిలిచి "అమ్మా! ఈయన పిటిషను ఏదో మీదగ్గరకు వచ్చిందట. స్టేజ్ ఏమిటో చెప్పండి" అన్నారు. కళ్ళజోడు పెట్టుకున్న ఓ బట్టతల వ్యక్తి. అతని ముందు కూర్చుని ఉన్నాడు. యాభై ఏళ్ళు పైబడే ఉంటాయి.

" అదేనమ్మా! కేసారం గ్రామంలో .. ధర్మారావు గారి ... భూమిలో పుంత లేదని .. సర్టిఫికేటు కోసం" అంటూ నాన్చుతూ చెప్పాడు.

" ఓ .. మీరేనా! ధర్మారావు గారు"

" కాదమ్మా! అతని బావమరిదిని. విషయం తెలుసుకోవాలని .. వచ్చాను"

" డాక్యుమెంట్లు కావాలని అన్నాం కదా! ఒరిజినల్స్, ఓ జిరాక్స్ కాపీ తెమ్మన్నాం అని చెప్పండి. డాక్యుమెంటు చూడకుండా ఏ సర్టిఫికేటు ఇవ్వలేము" అతనికీ పరిస్థితి వివరించాను.

" సరే చెబుతాను" అని వెళ్ళిపోయాడు.

ooo

నెలరోజుల తరువాత ఆఫీసరుగారు 'రమ్మన్నారు' అంటే. వెళ్ళాను.

ఆ రోజు సూపరిండెంటు గారి దగ్గర కూర్చున్న వ్యక్తే... ఆఫీసరుగారి చాంబర్లో కూర్చుని వున్నాడు. టేబుల్ మీద. ఆఫీసరుగారి చేతిలో వాళ్ళదే ఫైలు.

వెళ్ళీ వెళ్ళగానే ఆఫీసరు గారు "ఏమిటండి? ఈ కేసు ఏం చేసారు. మీకు 'మెమో' ఇచ్చి ఎన్ని రోజులైంది. పోయిన నెల 'ఇరవైనాలుగున' ఇచ్చాను. నెల రోజులు దాటిపోయింది. ఇప్పటి వరకూ రిపోర్టు ఇవ్వకపోతే ఎలా?" నా ఆలస్యాన్ని నిలదీసారు.

పబ్లిక్‌ని ముందు పెట్టుకుని కోపం తెచ్చుకున్నారంటే ... ఏదో నేరం చేసినట్లే అర్థం.

"వాళ్ళని డాక్యుమెంట్స్ తెమ్మన్నాను సార్." డాక్యుమెంట్లు తెచ్చుకోక పోవడం వల్లే 'లేటు' అనే అర్థం వచ్చేలా.

"అవి పూర్వార్జితం భూములు సార్. వాటికీ డాక్యుమెంట్లు ఉండవు" అన్నాడు ఆ వ్యక్తి.

ఆ విషయం నాతో అనలేదు. డాక్యుమెంట్లు వంకతో నేనే 'లేటు' చేస్తున్నానని చెప్పాలని అతని ఉద్దేశం కావచ్చు. అతన్ని చూస్తే ఆ నిముషం నాకు కాస్త కోపం కూడా వచ్చింది. ఇలా నా పైవాళ్ళ దగ్గరికి వచ్చి కూర్చుంటే అతనో వీ.ఐ.పి. అని భయపడి కావాల్సిన పని చేసిపెట్టేస్తానని అనుకున్నాడు కాబోలు.

ఓ సారి ఫైలు చదివితే నాకు అన్నీ గుర్తే. "పూర్వార్జితం ఏమిటండీ. 1999 లోనే కదా! కొన్నారు" అంటూ ఆఫీసరుగారి ముందు ఉన్న ఫైలు తీసుకుని, వాళ్ళు జతచేసిన పట్టాదారు పాసు పుస్తకం నకలును చూపించాను.

'డాక్యుమెంటు రిజిస్ట్రేషన్ నెంబరుని, తారీకుని' చదివి వినిపించాను.

అక్కడే ఉన్న గ్రామాధికారి సంగీతరావు గబగబా ముందుకొచ్చి 'డాక్యుమెంటు నెంబరు' నోట్ చేసుకున్నాడు. "డాక్యుమెంటు దగ్గర లేకపొతే, సర్టిఫైడు కాపి తీసుకోండి. పక్కనే ఉందికదా! రిజిస్ట్రేషన్ ఆఫీసు" అంటూ ఓ ఉచిత సలహా పారేశా. ఆఫీసరుగారి దృష్టిలో తక్కువ కాకూడదని.

ooo

ఆ మరునాడు ఆఫీసుకి వెళ్లేసరికి తెల్లటి లాల్చీ షరాయి వేసుకున్న ఓ అరవై ఏళ్ల వయసున్న వ్యక్తి నా సీటు ముందే నిలబడి ఉన్నాడు. చేతిలో కాగితాలతో.

" ఎవరండీ" అడిగా. నా కోసమే వచ్చినట్లు అనిపించి.

" అదేనమ్మా! డాక్యుమెంట్లు కావాలని అడిగారట కదా"

" ఓ మీరేనా! ధర్మరావు గారు" ముందు రోజు సంఘటన గుర్తుకొచ్చి. "అవునమ్మా" అంటూ రెండు

డాక్యుమెంట్లు నా ముందుపెట్టి వివరిస్తూ ... "ఆ రోజు కేసారం గ్రామసభలో నన్ను చూసే ఉంటారు" అంటూ 'తన' పరిచయాన్ని గుర్తు చేసాడు. అప్పుడు గుర్తుకొచ్చింది. ఆ రోజు గ్రామసభలో నా ప్రక్కన పట్టుచీర కట్టుకుని, కూర్చున్న 'సర్పంచిగారి' భర్త ఇతనేనని. గ్రామస్తులు అడిగిన ఏ ప్రశ్నకైనా ఆమె బదులు ఇతనే సమాధానం ఇచ్చాడని. ప్రస్తుత గవర్నమెంటులో డెబ్బైశాతం మహిళా సర్పంచులున్నా వారంతా నామమాత్రంగా సభలకి, సమావేశాలకి హాజరయితే వారితోపాటు భర్తలూ హాజరయ్యి చక్రం తిప్పుతున్నారు.

ప్రస్తుతం సర్పంచికాని సర్పంచి నా ముందు నిలబడిఉన్నాడు. ఆ ఊరిలో వి.ఐ.పి.ని అలా నిలబెట్టి మాట్లాడడం నాకు సబబుగా అనిపించలేదు. కూర్చో మనడానికి నా సీటు ముందు ఓ కుర్చీ కూడా లేకపోవడం దరిదాపుల్లో ఒక్క అటెండరూ కనిపించకపోవడంతో నేనే లేచివెళ్లి నా పక్క సీటు ముందు ఉన్న కుర్చీ తీసుకొచ్చి కూర్చోమన్నాను.

ఎందుకంటే ఊళ్లోకి వెళితే మమ్మల్ని రిసీవ్ చేసుకునేది ఇలాంటి పెద్దమనుషులే కాబట్టి. ఆ మర్యాదకే అతనెంతో పొంగిపోయాడు.

" మీకేందుకమ్మా! శ్రమ" అంటూనే సుఖాసినుడై, విషయం వివరించి చెప్పాడు.

ఆ సర్వే నెంబరు మొత్తం నాలుగున్నర ఎకరాల మామిడితోట. పొలం గల రైతు ధర్మరాజు గారికి మూడు ఎకరాలు, విజయలక్ష్మి అనే ఆవిడకి ఎకరన్నర అమ్మి, ఇద్దరికీ ఒకే రోజున రిజిస్ట్రేషను చేసాడు. అంతవరకూ బాగానే ఉంది.

విషయం ఇంకా వివరిస్తూ, "నా తోటలో వృథాగా వదిలేసిన స్థలం ఉంటే నమ్మా! అందులోంచి కాస్త 'నడవడానికి దారి' ఇమ్మని, గ్రామంలో కొంతమంది రైతులు, చాన్నాళ్ళ క్రిందటే అడిగారమ్మా! వాళ్ళ పొలాలకు వెళ్ళడానికి పశువుల్ని దగ్గర దారెమ్మట తోలుకుని రావడానికి వీలుగా ఉంటుందని, సరేలే! ఖాళీగా వదిలేసిందేకదా! అని .. ఒప్పుకున్నా. చాలా సంవత్సరాలుగా అలాగే సామరస్యపూర్వకంగా నడిచిపోతూనే ఉంది"

"ఇప్పుడు అదే దారి గురించి తమ్ముడు మా చిన్నాన్నగారి అబ్బాయి గొడవ. అది నీ స్వంతం కాదు. 'గవర్నమెంటు పుంత' అంటాడు. మాటామాటా వచ్చి, కోర్టులో కేసు కూడా వేసాడు. అందుకే ఇలా సర్టిఫికేటు కోసం వచ్చాను" " అది నా స్థలంలో నేను నా మంచితనంతో ఇచ్చిన చిన్నదారి అంతే. కాబట్టి, నా భూమిలో 'పుంత లేదని' మీరు సర్టిఫై చేస్తే చాలు. "సార్ వెంటనే సర్టిఫికేటు ఇచ్చేస్తానని అన్నారు" అంటూ వివరించాడు. ఆఫీసరుగారితో తనకున్న దగ్గరతనాన్ని తెలియచేస్తూ.

" సరే! ముందు డాక్యుమెంట్లు చూసి ఆ తరువాత ఫీల్డు చూస్తాను. రేపు వస్తాను లెండి"అన్నా.

కాస్త ఇబ్బందిగా ఫీలవుతూ "అసలు నువ్వొచ్చి చూడాల్సిన పని కూడా లేదమ్మా. సంగీతరావుకు అంతా తెలుసు నా విషయం. మీరు ఇక్కడ కూర్చునే రాయొచ్చు. అంత చిన్న విషయం." కన్విన్స్‌డ్‌గా అన్నాడు. 'చిన్నవిషయం' అన్న మాట మీద వత్తి పలుకుతూ.

దానికి ప్రతిగా నవ్వేస్తూ "ముందు వాళ్ళ రిపోర్టులు సరిగా లేవనేకదా నన్ను చూడమంటుంది. చూసిన తరువాతే రాస్తాను. అయినా మీ ఊరు ఎంత దూరం అని. దగ్గరే కదా ఓసారి చూసేస్తే అయిపోతుంది".

"విషయం ఇంతవరకూ సాగదియ్యకుండా అసలు నేనే 'ప్రొక్లెయినరు' పెట్టి ఓ పక్క కలిపేసుకుంటే అడిగే వాళ్ళుండరు. కాకపోతే పదవిలో ఉన్నాం కదా, 'అలా చెయ్యకూడదని' చూస్తున్నా. కోర్టులో సర్టిఫికేటు అడిగారు కదా అని ఇలా వచ్చాను." అన్నాడు ఆవేదనగా.

ooo

అనుకున్నట్లుగానే ఆ మరునాడే వెళ్ళాను.

గ్రామ అసిస్టెంటుని తోడు తీసుకుని. ధర్మరావుగారి మరో బావమరిది వెంట రాగా స్థలం పరిశీలిస్తే ధర్మరావు గారు కొనుక్కున్న భూమికి విజయలక్ష్మి గారు కొనుక్కున్న భూమికి మధ్యగా తాటిచెట్ల బారుతో కూడిన 'బండ్లదారి' వుంది. ఆ తాటిచెట్ల వయస్సు కూడా యాభై ఏళ్ల పైమాటే. అంటే అప్పటి నుంచే ఆ దారి ఏర్పాటు చేయబడిందన్నమాట..అందుకే సర్వే రికార్డులో కూడా చుక్కల రూపంలో చూపించారు. దాన్నే ధర్మరావుగారు .. వూరి ప్రజలకు తన .. మంచి తనంతో ఇచ్చిన చిన్న 'కాలి మార్గము'గా చెబు తున్నది. విజయలక్ష్మి గారు కొనుక్కున్న భూమికి ..పూర్తిగా ఫెన్సింగ్ వేసేసుకుని, డాక్యుమెంటు ప్రకారం .. వారి భూమిలో ..వారున్నారు. ఈ దారితో ఏ సంబంధమూ లేకుండా. అతను దయతో, మంచితనంతో ఇచ్చాననంటున్న కాలి దారి చాలా ఏళ్లుగా ఉన్నదే. కొత్తదాన్ని కాబట్టి, నాకే కాస్త 'కథ' వినిపించాడు. ఎంక్వయిరీ పూర్తవడంతో ధర్మరావుగారి బావమరిది పని ఉందంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

నేను, మా అసిస్టెంటు ఇద్దరం వెనుదిరిగి వచ్చేస్తుంటే, అక్కడే ఉపాధి హామీ పథకంలో రోడ్డు వేస్తున్న కూలీలు పలకరించారు. ఓ నలభై మంది వరకూ ఉన్నారు. పలుగూ .. పార పట్టుకుని పనిచేస్తున్నారు. నన్ను చూసి చేసిన .. చేసే పనిని ఆపి ఎందుకొచ్చారో వివరాలడిగారు.

దానికి వాళ్ళలో వాళ్ళే కాస్సేపు ... తర్జన భర్జన చేసుకుని,.. వాళ్ళలో ఓ పెద్దాయన ముందుకొచ్చి . " అమ్మా! తమరికి ఓ విషయం .. మనవి చేసుకోవచ్చా. మీలా చదువుకోలేదు, మేము. అయినా నేనో రెండు మాటలు మాట్లాడవచ్చా" సందేహంగా అడిగాడు.

" సరే. అలాగే. మాట్లాడండి" అన్నా.

ఆ పల్లెటూరిలో, మామిడి తోపుల మధ్యన నిలబడి వాళ్లతో అలా .. మాట్లాడడం నాక్కాస్త కొత్తగా అనిపించింది. నాకు చిన్నప్పటి నుంచి తెలియని ప్రపంచం అది. వేసవితాపాన్ని లెక్కచేయకుండా .. చెట్టు నీడన నిలబడుతూ.

ఆ పెద్దతను చెప్పడం మొదలెట్టాడు " అమ్మా! మా ధర్మరావు దొరగారు, అళ్ళ చిన్నాన్న గారి కొడుకు బుచ్చిరాజుగారూ ఊళ్లో పెద్దమడుసులే"

" మీరు ఎంక్వయిరీకి వచ్చిన ఆ పుంత మా చిన్నప్పటి చూస్తున్నదే. సర్కరుది. ఎన్నో



సంవత్సరాలుగా మేము ఇదే దారెమ్మట నడుస్తూనే ఉన్నాం. ఇది మాది. ప్రజలందరిది. .. మీరొచ్చి 'పుంత' లేదంటే, మా ఊరి ప్రజలకు అన్యాయం చేసినట్లు .. అవుతుంది అమ్మగారూ" అన్నాడు తటపటాయిస్తూ.

" అయ్యన్నీ మనకెందుకు?" ఓ తలపాగా చుట్టుకున్నతను వారించబోయాడు.

" నువ్వూరుకో. ఇప్పుడు కాకపోతే .. ఎప్పుడు మాట్లాడతాం. అమ్మగారు వచ్చారు కాబట్టి, చెప్పాలి" పెద్దాయన అతన్ని కసురుకున్నాడు.

దానికి అక్కడున్న కూలీలు " అవునమ్మా ఆ పుంత లేకపోతే .. మెయిన్ రోడ్డు మీదకు వచ్చి చాలా దూరం.. ఊరు చుట్టూ తిరిగివెళ్ళాలి " అంటూ తమ వంతు సమ్మతి తెలిపారు. బహుశా దొరగారి మనుషులు అక్కడ లేకపోవడమే వాళ్ళ ధైర్యం కావచ్చు.

" అసలు దొరగారి తోట వెనకాల ఉన్న .. కొండను తవ్వుకుని, మట్టిని అమ్మేవారు. ఈ పుంత నుంచే వెళ్ళేవి .. మట్టి ట్రాక్టర్లు ... బయటకి.

ఆ మాటలకు ఆశ్చర్యంతో .. విస్తుపోయి చూసాను. ధర్మారావు దయతో ఇచ్చిన కాలి మార్గాన్ని నేను 'బండిదారే' అనుకున్నా. దీనిలో ట్రాక్టర్లు కూడా పోతాయన్నమాట. అంతకుముందే

ఎండుగడ్డి లోడు వెళ్ళినట్లుంది. ఆరాదింటా గడ్డిపరకలు చెట్లకు వ్రేల్లాడుతున్నాయి.

అందుకేనా ..నేను .. చూడాల్సిన పని లేకుండానే ఆఫీసులో కూర్చుని రిపోర్టు వ్రాయోచ్చున్నది."ఈ విషయంలో తమ్ముడి కొడుకుతో గొడవలైనాయి, కోర్టు కెక్కారు. ఈ విషయంలో బాగా ఆలోచించి .. మీరే సరియైన నిర్ణయం తీసుకోవాలి. ఈ దారి లేకపోతే .. మేము ఇబ్బంది పడతాం" అంటూ చేతులు జోడించాడు ఆ ముసలతను. ఒక్క వైపే వివరాలు వినడంతో.. విషయం చాలా చిన్నదనుకున్నా.

ooo

ఈ విషయంలో ఏవిధంగా రిపోర్టు ఇవ్వాలో తెలియక అవస్థపడుతున్నా.. ధర్మారావు గారు చెప్పిన 'స్టోరీనే పదే పదే గుర్తుకొస్తుంది. మంచితనానికి మరో పేరంటే తనేనట్టుగా.. ఎంత చక్కగా చెప్పాడు.

ఒక్కరోజు టైము తీసుకుని బాగా అలోచించి వ్రాసి ఇవ్వాలి అని అనుకుంటుండగానే "అమ్మా! నా రిపోర్టు వ్రాసి ఇచ్చేసారా. నేను సర్టిఫికేటు టైపు చేయించుకుంటాను" ఆఘమేఘాల మీద వస్తూనే అడిగేసాడు. నాదంటూ ఓ రిపోర్టు ఉంటే చాలు అతనికి సర్టిఫికెట్ వచ్చేసేనట్టే అనుకుంటున్నాడు.

"అప్పుడేనా. ఉదయాన్నే కదా చూసాను. కాస్త ఆలోచించి వ్రాయాలి. కోర్టుకి వెళ్ళేది కదా" అన్నా.

"అలా చెప్పడం తప్పైపోయిందన్న మాట" నిస్టూరం వేసాడు.

"మీరు చెప్పాలనుకోకపోయినా.. మేము అడుగుతాం. కదా"

"రేపే... కోర్టు వాయిదా"

" ఈసారికి వాయిదా .. అడగండి. అంత త్వరగా సర్టిఫికేటు ఎక్కడ తయారైపోతుంది. నా నుంచి మళ్ళీ సెక్షనుకి వెళ్ళాలి" అన్నా.

" ఇప్పటికే ఇది మూడో వాయిదా. లేకపోతే కేసు ఓడిపోయే ప్రమాదం ఉంది"

వదిలేలా కనిపించలేదు. ఇలాంటి కష్టాన్ని ముందుకు పెట్టుకుని, ఇంటికెళ్ళి ఏం సుఖంగా నిద్రపోగలను. " సరే. సాయంత్రం .. వెళ్ళేలోపు.. రిపోర్టు ఇచ్చి మరీ వెళతాను" హామీ ఇచ్చాను.

అనుకున్నట్లుగానే .. వ్రాయాల్సిన రిపోర్టు వ్రాసి .. ఆఫీసరుగారికి ఇచ్చాను. ఆ రిపోర్టు మీద ఆఫీసరుగారు ఒకింత ఆశ్చర్యమే .. వెలుబుచ్చారని అనిపించింది.

ooo

రెండురోజుల తరువాత అనుకుంటా ...

అటెండరు ..వెంకటేశం ఈ ఫైలు విషయమే మాట్లాడాడు. అతనికీ .. వచ్చినతని మీద ఇంటరెస్టు. అలాంటి వాళ్ళు వస్తే .. వెంట తిరుగుతారు చిల్లర కోసం.

"ఆ రోజు మీరు వెళ్ళిపోయిన తరువాత అమ్మా! కేసారం .. దొరగారు వచ్చారు. అయన రావడం తోనే .. సెక్షను నుంచి ఫైల్ .. తెప్పించుకున్నారు సారు. మీ రిపోర్టు చూపించి ... ఆర్.ఐ. ఈ విధంగా రిపోర్టు వ్రాస్తే, నేను ఏ విధంగా సర్టిఫికేటు ఇవ్వగలను" అన్నారు.

అవును మరి .. నేనేం అతనికి అనుకూలంగా వ్రాయలేదు. అక్కడ ఉన్నదే వ్రాసాను. ఆ సర్వే నెంబరు మొత్తం విస్తీర్ణం నాలుగున్నర ఎకరాలు. మూడు ఎకరాలు ధర్మరావుగారు కొనుక్కోగా .. మిగిలిన ఎకరన్నర విజయలక్ష్మి గారు కొనుక్కుని, వారి భూమికి .. ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకుని ఉన్నారు. ఈ దారితో సంబంధం లేకుండానే.

కాబట్టి, ధర్మరావుగారు కొన్న భూమి, లోనిదే ..ఆ పుంత. ఆ మార్గం గుండా బండ్లు కూడా ప్రయాణించ గలవు. ఆ మార్గమునకు ఇరువైపులా ఉన్న తాటిచెట్ల వయస్సు సుమారు యాభై సంవత్సరాల పైమాటే. ఈ మార్గాన్నే 1958లో తయారుచేసిన ఎఫ్.ఎంబి. స్కెచ్‌లో చుక్కల మార్గముగా చూపించారు. దరఖాస్తుదారుడు ఈ స్థలాన్ని 1999లో మాత్రమే కొన్నాడు.

ఆ 'పుంత' దరఖాస్తుదారుడు కొనుగోలు చేసిన భూమిలోనే ఉన్నది. కావున దరఖాస్తుదారుడు కోరిన విధంగా అతని స్థలంలో 'పుంత' లేదని సర్టిఫికెట్ ఇచ్చుటకు 'వీలుపడదు' అని.

డాక్యుమెంట్లలో ఆ 'దారి మార్గం' గురించి ప్రస్తావించపోవడంతో .. దాన్ని అవకాశంగా తీసుకుని, ఆ దారి మార్గాన్ని తన భూమిలో కలిపేసుకుంటే .. తన 'మట్టి వ్యాపారం' సజావుగా సాగుతుందని భావించాడు.

అతడు స్థానికుడు. ప్రజాప్రతినిధిగా అవకాశం. రికార్డు పరిశీలించిన ఆఫీసరుగార్కి ఈ విషయం తెలియక కాదు.కాకపోతే నేను కాస్త కొరుకుడు పడలేదు. ప్రస్తుత ఆధునిక టెక్నాలజీలో ... రెవిన్యూ రికార్డులు, ఎఫ్.ఎం బి. స్కెచ్ లాంటివి కంప్యుటరైజు అయి ఉండడంతో .. అవి ఏ సంవత్సరంలో తయారుచేసారు వంటి వివరాలు .. ప్రజలకు అందుబాటులోకి వచ్చేసాయి. అతను నా రిపోర్ట్ అంతా చదువుకుని " ఫార్మాలిటీస్ కూడా ఉంటాయని చెప్పాను సార్" అంటూ నొచ్చుకున్నాడట.

'ధర్మో రక్షిత రక్షితః' అన్నారు పెద్దలు. ✸

కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

సేవా

అడవికి అమ్మానాన్న...!



పచ్చదనం కోసం పాకులాడే సంస్థలు, గ్రామాల గురించి వినేవుంటాం. మొక్కల్ని నరికివేయకుండా స్థానభ్రంశం ద్వారా వాటిని కాపాడుతున్న వ్యక్తుల గరించి తెలుసుకునే వుంటారు. ప్రకృతి పరిరక్షణలో భాగంగా ఏకండా ఓ అడవినే తయారు చేసిన వారి గురించి మీరెప్పుడైనా విన్నారా? అయితే అనిల్ ప్రమీలా జంట గురించి మీరు తెలుకోవాల్సింది చాలానే వుంది. కర్నాటకలో బంజర భూముల్ని అడవిగా మార్చడంతోపాటు వన్య ప్రాణి సంరక్షణా కేంద్రాన్ని స్థాపించారు. ప్రస్తుతం వందలాది వన్య ప్రాణులకి ఆవాసంగా మారిన ఎస్ఎఐ స్యాంక్చురీ గురించి మీరూ తెలుసుకోండి.

అనిల్, ప్రమీల పరిచయం అమెరికాలోని న్యూజెర్సీలో. ఒకరినొకరు ఇష్టపడడంతో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. హవాయ్‌లోని ఓ దీవిసము దాయంలో హనీమూన్‌కి ప్లాన్‌చేసుకున్నారు. అక్కడి అడవుల్లో జీవజాతులు ప్రకృతి అందాలన్నీ ఆ జంటని కట్టిపడేశాయి. కొంత భూమిని కొనుక్కొని అక్కడే సెటిలైపోవాలనిపించిందట ఇద్దరికీ. ఓ పక్క అన్ని చోట్లా చర్చనీయాంశంగా మారిన గ్లోబల్ వార్మింగ్ గుర్తొచ్చి ఒక్క సారి ఉలిక్కిపడ్డారిద్దరూ. ఇంత హాయినీ, ఆరోగ్యాన్ని అందిస్తున్న అడవి పరిరక్షణ బాధ్యత కూడా మనుషులదే అంటాడు అనిల్. అనిల్ తండ్రి మరణంతో 1986లో భారత్‌కి చేరుకున్న ఈ జంటకి ఇక్కడ పరిస్థితులు మరింత ఆలోచనలో పడేశాయి. అడవుల నరికివేత, నీటి కాలుష్యంతోపాటు అడవి జంతువులు ప్రమాదకర స్థితిలోకి నెట్టి వేయబడుతున్నాయనే విషయాలని తెలుసుకున్నారిద్దరూ. ప్రకృతి పరిరక్షణ ధ్యేయంగా హవాయ్‌లో వారి సొంతింటిని అమ్మేసి భారత్‌కి చేరుకున్నారు. ఉత్తర కర్నాటక ప్రాంతంలో కొంత భూమిని కొనే ప్రయత్నాలు మొదలయ్యాయి. అయితే ఇక్కడ భూమిని అమ్మేందుకు ఎవరూ ఇష్టపడలేదు. దక్షిణ కర్నాటకలోని కడగు ప్రాంతంలో ఓ రైతు పెద్ద మొత్తంలో తన బంజర భూమిని అమ్మేందుకు ముందుకు రావడంతో 55 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు అనిల్. కాఫీ మొక్కల సాగుకు కూడా ఉపయోగపడని ఆ భూమిని ఏంచేసుకుంటారంటూ స్థానికులు నవ్వుకునేవారు. అలాంటి భూమిలో పునరుద్ధరణ పనులు మొదలయ్యాయి. స్థానిక మొక్కల రకాలని తెలుసుకుని వాటినే ఈ భూమిలో నాటారు. ముందుగా ఏపుగా గడ్డిమొక్కలు పెరిగాయి. తర్వాత మొక్కలు కూడా క్రమంగా పెద్దవయ్యాయి. పచ్చటి మొక్కల ద్వారా పెద్ద ఎత్తున వర్షాలు కూడా మొదలవ్వడంతో కొద్ది రోజుల్లోనే ఈ ప్రాంతం కొన్ని జంతువులకి స్థావరంగా మారింది. అయితే అడవికి పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో రైతులు ఎక్కువగా ఎరువులు క్రిమి సంహారకాలని వాడుతుండడంతో వాటి ప్రభావం ఇక్కడ వృక్షాలు.

జంతుజాతులకి ప్రమాదకరం అనే విషయాలని తెలుసుకున్నారిద్దరూ. ఆ భూములని కొనడం ద్వారా అడవిని మరింత సారవంతంగా మార్చగలమనేది వాళ్ల అభిప్రాయం. స్థానిక రైతులని ఒప్పించి కాస్త ఎక్కువ డబ్బుకే ఆ భూమిని కూడా కొనుగోలు చేసింది అనిల్ జంట. అలా మొత్తం మూడు వందల హెక్టేర్లలో రూపుదిద్దుకుంది వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 'సేవ్ యానిమల్స్ ఇనీషియేటివ్'(ఎస్ఎఐ). జీవవైవిధ్యానికి సావలంబనగా వుండే ఈ కేంద్రంలో దాదాపు మూడు వందలకి పైగా రకాల పక్షులున్నాయి. ఆసియా ఏనుగులు లాంటి ఎన్నో అంతరించి పోతున్న జంతుజాతులతోపాటు రాయల్ బెంగాల్ పులులు, సివియట్ పిల్లులు, పెద్ద పరిమాణంలో వుండే మల్బార్ ఉడతలు, లారిస్, రకరకాల జింకలకి ఈ ప్రాంతం స్థావరంగా మారింది. జీవవైవిధ్యాన్ని కాపాడుతున్న ఈ ప్రాంతంలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు నిర్వహించారు. వారి ద్వారా ఎస్ఎఐ వణ్యసంరక్షణ కేంద్రానికి 'నోవాస్ ఆర్క్' అనే పేరు స్థిరపడింది. .

అయితే వేట గాళ్ల నుంచి వాటిని కాపాడడం వీళ్లకి పెద్ద సమస్యగా మారింది. కొన్ని సార్లు వారితో తలపడాల్సి వచ్చేది. వేటగాళ్ల ద్వారా గాయపడిన సందర్భాలూ లేకపోలేదు. ఇలాంటి దాడులన్నీ అవగాహనా లోపం వల్ల జరిగినవనేది ప్రమీలా అభిప్రాయం. అందుకే వన్యప్రాణులని కాపాడే పనిని కూడా తమ భుజాలకెత్తుకున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమాలు, ఉపాధి కల్పన ద్వారా వేటగాళ్లలో మార్పుని తేగలిగారు. ఒకప్పుడు కాలి అడుగుల చప్పుడు తప్ప మరే ఇతర శబ్దాలు వినపడని ఈ ప్రాంతం ఇప్పుడు పక్షుల కిలకిలరావాలతో కొత్త శోభని సంతరించుకుంది. ఓ బంజర ప్రాంతం పచ్చటి వనంగా మార్చడానికి అనిల్ ప్రమీల రెండున్నర దశాబ్దాల పాటు పనిచేశారు. ఆరు పదుల వయసులో ఇప్పటికీ ఈ జంట అదే పనిలో వుండడం అభినందనీయం. ✦

సరదాగా నవ్వించే కథలు



పుస్తకం పేరు : సుందరి సుబ్రహ్మణ్యం (నవ్వుల కథలు)
రచన : సి.ఎన్.నాగేశ్వర రావు, సి.ఎల్.రాజకుమారి,
పేజీలు :136
ధర : 100 రూ.
ప్రతులకు : తెలుగు రాష్ట్రాల్లోని నవచేతన, విశాలాంధ్ర బుక్‌హౌస్‌ల్లో

కుటుంబంలో ఇంటిల్లపాదీ ఆహ్లాదంగా ఆనందంగా గడిపే రోజులు రానురానూ కనుమరుగైపోతున్నాయి. మనుషులు మాట్లాడుకునే సమయాన్ని కూడా టీవీలు, స్మార్ట్‌ఫోన్లూ కబళించేస్తున్నాయి. నిరంతర జీవనపోరాటంలో అలసిపోతూ, నలిగిపోతూ, అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఎంతోమందిని మన కళ్ల ముందే చూస్తున్నాం. అంతులేని సంపదపోగైతే తప్పా ఆనందంగా గడపడం సాధ్యం కాదనే భ్రమని పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చిన నవ్వుల కథల పుస్తకమే 'సుందరి సుబ్రహ్మణ్యం'. రచయితలు సి.ఎన్.నాగేశ్వరరావు, సి.ఎల్.రాజకుమారిలు. ఈ పుస్తకంలో 21 కథలున్నాయి. వీటిని కథలు అనడం కన్నా మినీ నాటికలు అంటే సరిపోతుందేమో! కథావస్తువు కన్నా అన్నింటిలోనూ సంభాషణలతోనే కొత్త శైలిలో ఈ రచన సాగింది. వివిధ రకాల అంశాలపై హాస్యస్ఫోరకమైన, వ్యంగ్యమైన మాటలతో వీటిని ఆసక్తికరంగా మలిచారు. వీటిలో మొదటిది 'మతిమరుపు' ఇందులో నాలుగు పాత్రల మధ్య జరిగిన సంభాషణలు నవ్వుపుట్టిస్తాయి. రెండోది 'పెన్సిలు–రబ్బరు' కుటుంబంలో నిత్య జీవితాల్లో జరిగిన ఘటననే సంభాషణలతో అందించారు రచయితలు. సెల్‌ఫోన్ ఇంకా అందరి జీవితాల్లోకి రాకముందు రాసినది మూడోదైన 'టెలిఫోన్'. దీనిని వాడే సమయంలో కుటుంబంలో జరిగిన చమత్కారాలు ఇందులో చదివి హాయిగా నవ్వుకోవచ్చు. ఈ పుస్తకంలో నాలుగోది 'బహునామధారి' ఇది కూడా హాస్య సంభాషణలతో సాగిందే. ఈ సంపుటిలోని మిగతావి-కల, తువ్వాలు, పుల్కాలు, వాకింగ్, పూజ, వసుంధర, అలారంపీస్, పూలవేట, స్కూటరు పూజ, చెప్పులు, గిఫ్ట్, ట్రీట్‌మెంట్, కాలీఫ్లవర్, సుందరి టూర్....ఇలా మరికొన్ని కూడా ఇదేశైలిలో అలరిస్తాయి. రచయితలు తమ నిజజీవితంలో పరిచితులైన ఒక కుటుంబంలోని వారి జీవితాల్లో సాగిన ఘటనలనే ఇలా కథానాటికలుగా అందించారని తెలుస్తోంది. వీటన్నింటిలో సుబ్రహ్మణ్యం పిసినారి మొగుడైతే, సుందరి గడుసు భార్య, మిగిలిన కుటుంబసభ్యులు అనుబంధ పాత్రలు. మొత్తమ్మీద కాస్తా వినోదాన్ని పొందాలంటే ఈ సంపుటిని చదవాల్సిందే. మంచి హాస్యాన్ని ఇలా అక్షరరూపంలో అందించిన రచయితలు అభినందనీయులు.

- సమత

కొత్త పుస్తకాలు

జీవితాన్ని తట్టే కవితలు



పుస్తకం పేరు : దేవరాజు రవి కవితలు
రచయిత : దేవరాజు రవి
పేజీలు :96
వెల :70/-
ప్రతులకు : దేవరాజు రవి, 1-78/34, సాయి నివాస్, గ్రీన్ ల్యాండ్ కాలనీ, మేడిపల్లి, హైదరాబాద్– 500098,
సెల్ :9160896463

దేవరాజు వెంకట కృష్ణారావు పంతులు వారసుడుగా కాకుండా తనదైన డిఫరెంట్ స్టైల్‌తో 'రామం' అనే నవలతో దేవరాజు రవి సాహితీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత ఎన్నో కథలూ, నవలలూ తన కలం నుంచి జాలువారాయి. మూడు కవితా సంకలనాలనూ సాహితీప్రియులకు అందించారు.

పూర్తిగా తనదైన శైలిలో రవి అందించిన కవితా సంకలనమే 'దేవరాజు రవి కవితలు' . ఈ 96 పేజీల పుస్తకంలో జీవితంలో అనేకానేక అంశాలనూ, పార్శ్వాలనూ మీటే 54 కవితలున్నాయి. ప్రతి సందర్భాన్నీ, సన్నివేశాన్నీ కవితగా మలచగలగటం కొంతమందికి మాత్రమే అబ్బుతుంది. ఈ టెక్నిక్‌ను రాజు అందిపుచ్చుకున్నారు. అదే మనకు అడుగడుగునా కనిపిస్తుంది. 'వద్దు సుమా చెడిపోతావ్' అనే కవితలో దేవుడి తరపున స్వగతాన్ని వినిపిస్తాడు. ఆ తరువాత చందమామనూ, మల్లెపూలనూ, పిల్లగాలులనూ, గొంతు విప్పి కూసే కోయిలమ్మనూ అక్షరాలను చేసి తన ఆమెనే 'రా మరి వెళ్లకు' అంటాడు. 'లేటైనా స్వీటే' అంటూ చివరికి అసలు మనం కలుసుకోకనే పోయుంటే? నువ్వెవరో తెలుసుకోకనే పోయుంటే? అంటాడు. ప్రియురాలుతో మాట్లాడతాడు, తప్పుచేసినప్పుడు పోట్లాడతాడు, శ్రామికుడు తరుపున స్వేదానికి అగ్రపీఠం ఇస్తాడు. 'నీ శక్తే సర్వస్వం' అని మేల్కొలిపే కవితనూ రాశాడు. 'తాత్కాలిక ఆనందం'లో తాగుడంటే ఎందుకంత మోజు అని ప్రశ్నిస్తాడు. 'ఇన్ని నాళ్ల స్వాతంత్ర్యం ఇంత అన్నమిచ్చిందా? రూపాయకు విలువలేదు పాపాయికి బువ్వ లేదు' అంటూ దేశంలో ఇన్నేళ్ల స్వాతంత్ర్యంలోనూ మారని పరిస్థితులపై కన్నెర్ర చేస్తారు.

మూడు, నాలుగు దశాబ్దాల క్రితం కవిత్వం కూడా చేర్చడం ద్వారా పాత కవిత్వాన్ని చదవాలనుకునే వారికి ఇది ఉపయోగపడుతుంది. అప్పటి పరిస్థితలను బట్టేమో కొన్ని చోట్ల ప్రాస కోసం చేసిన ప్రయత్నంలో భావానికి అన్యాయం చేసినట్టు అనిపిస్తుంది.

సిద్ధార్థ కట్టా

క్యారెట్ ఐస్ క్రీమ్



కావాల్సిన పదార్థాలు

క్యారెట్ జ్యూస్-3 కప్పులు
పాలు-2 కప్పులు
చెక్కెర-2 కప్పులు
క్రీమ్-1 కప్పు
బాదం పప్పు- 2 టేబుల్ స్పూన్లు
పిస్తా పప్పు-2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

ఒక మందపాటి పాత్రలో పాలు చెక్కెర వేసి స్టౌపై పెట్టాలి. కొద్ది పాలలో మొక్కజొన్న పిండి వేసి ఉండలు లేకుండా కలపాలి. ఈ మిశ్రమాన్ని తిరిగి పాలలో వేసి బాగా కలపాలి. పాలు చిక్కగా అయ్యాక క్రీమ్ వేసి కలపాలి. పాలు మరిగిన తర్వాత క్యారెట్ జ్యూస్ వేసి కలపాలి. మిశ్రమం మరింత చిక్కగా అయ్యే వరకు ఉడికించి దించేసుకోవాలి. చల్లారాక డీప్ ఫ్రిజర్‌లో పెట్టాలి. ఒక గంట తరువాత తీసి మిక్సీలో బాగా బ్లెండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో వుంచి బాదం, పిస్తాలతో అలంకరించుకుని ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. గట్టి పడిన తరువాత సర్వింగ్ బౌల్స్‌లో వుంచి అతిధులకందించండి.



మామిడితో ఐస్ క్రీమ్

మామిడి పండు గుజ్జు-1 కప్పు
చిక్కటి క్రీమ్-4 కప్పులు
కండెన్స్‌డ్‌మిల్క్-1/2 కప్పు
మామిడి పండు ముక్కలు-1/2 కప్పు
పంచదార-తగినంత
వెనిలా ఎసెన్స్-3 చుక్కలు

తయారుచేసే విధానం

బాగా పండిన మామిడి పండు చెక్కు తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకుని మిక్సీలో వేసి బ్లెండ్ చేసుకోవాలి. మొత్తం గుజ్జులా అయ్యాక అందులో కండెన్స్‌డ్ మిల్క్, పంచదార, ఎసెన్స్ వేసి మళ్లీ బ్లెండ్ చేయాలి. ఇప్పుడు ఐస్‌క్రీమ్ వేసి బ్లెండ్ చేసి ఒక గిన్నెలోకి తీసుకోవాలి. గిన్నె మూత పెట్టి డీప్ ఫ్రీజర్‌లో పెట్టాలి. రెండు గంటల తర్వాత తీసి మరోసారి మిక్సీలో బ్లెండ్ చెయ్యాలి. లేదా బీటర్‌తో నురగవచ్చేలా బాగా గిలక్కొట్టి మరో గంటసేపు ఫ్రిజర్‌లో ఉంచాలి. ఫ్రిజర్ నుంచి బైటికి తీసి అందులో సన్నగా తరిగిన మామిడి పండు ముక్కల్ని వేసి బాగా కలిపి కాస్త చల్లబడే వరకు ఫ్రిజర్‌లో వుంచాలి. ఈ మిశ్రమం చల్లబడిన తర్వాత ఫ్రిజర్ నుంచి తీసి సర్వింగ్ బౌల్‌లో వుంచి చల్ల చల్లగా మ్యాంగో ఐస్ క్రీమ్‌ని టేస్ట్ చేయండి.

రుచి

అరటి-ఆల్మండ్ ఐస్ క్రీమ్

అరటి పళ్ళు-3
కొకో పొడి-1/4 కప్పు
ఆల్మండ్ బటర్ పేస్ట్-4 టేబుల్ స్పూన్లు
వేయించిన వేరుశనగలు-10
ఉప్పు-చిటికెడు
చాక్లెట్ బార్/చిప్స్-4
లరాబార్ ముక్కలు-2

తయారుచేసే విధానం

బాగా పండిన అరటి పండ్ల గుజ్జు తీసి కాసేపు ఫ్రీజర్‌లో వుంచాలి. మిక్సీ జార్‌లో కోకో పౌడర్, వేరుశెనగ గింజల పొడి, ఆల్మండ్ బటర్ పేస్టు, ఉప్పు, చాక్లెట్ చిప్స్, లరా బార్ బైట్స్ వేసి బాగా బ్లెండ్ చేసుకోవాలి. అందులో కొద్దిగా పాలను చేర్చి మరోసారి బ్లెండ్ చేయాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసి మూతపెట్టి ఫ్రిజర్‌లో వుంచాలి. రెండుగంటల తర్వాత బైటికి తీసి సర్వింగ్ బౌల్స్‌లో ఐస్‌క్రీమ్‌ని వుంచి బాదం తరుగు, చాక్లెట్ చిప్స్‌తో గార్నిష్ చేస్తే అరటి ఆల్మండ్ ఐస్ క్రీమ్ రెడీ!

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

జ: ఇలియానా

ఏ నీడ ఎవరిది

పిల్లలూ! ఇక్కడ కొంతమంది సైనికులు వారి నీడలని వుంచాం. వాటిలో సైనికుల అసలైన నీడలని గుర్తించి జతచేయండి.



కనిపెడదాం

గొడుగు పట్టుకుని వున్న మహిళ కనిపిస్తున్న ఈ చిత్రంలో మరో వ్యక్తి ముఖ్యం కూడా దాగుంది. అదెక్కడుందో గుర్తించి సున్నాచుట్టేయండి.



పదాలు పూరించండి

ఇక్కడ ఏడు బొమ్మలున్నాయి. వాటి ఇంగ్లిష్ పేర్లలో ఒక్క అక్షరం మిస్సయింది. ఆ అక్షరాన్ని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాన్ని గుర్తించి ఖాళీలో నింపేయండే!



జ: bed, dog, fox, web, pin, mat, net, sit,

దారి కనిపెట్టండి

ఇక్కడ కనిపిస్తున్న ఈ కుక్క తన ఇంటికి చేరే దారిని గుర్తించండి.



నేర్చుకుందాం!

పిల్లలూ మీకు బొమ్మలు గీయడమంటే ఎంతో ఇష్టం కదా. మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ పిల్లి బొమ్మని ఎలా గీయాలో ఇక్కడ ఇచ్చారు. మీరూ ప్రయత్నించండి.



చుక్కలు కలపండి



అతి చిన్న లైబ్రేరియన్

పిల్లలూ మీకు పుస్తకాలు చదివే అలవాటుందా...క్లాస్ పుస్తకాలే చదవలేక పోతున్నాం ఇంకా వేరే పుస్తకాలేం చదువుతాం అనుకుంటున్నారా అయితే మీరు ఫ్లోరిడాకి చెందిన దాలియా మేరీ గురించి తెలుసుకోవాల్సిందే. నాలుగేళ్లలోపే వెయ్యికి పైగా పుస్తకాలు చదివేసి పుస్తకాల పురుగనే కితాబునీ తెచ్చేసుకుంది. పదకొండు నెలలప్పుడే పుస్తకాల పేర్లని చదవడం మొదలెట్టిన ఈ చిన్నారి ఇప్పుడు సాహిత్యంపై ఆసక్తి కనబరుస్తోంది. ఇంతకీ దాలియాకి పుస్తకాలు చదివే అలవాటు ఎప్పట్నించీ వుందంటే? తను అమ్మ కడుపులో వున్నప్పుడే తల్లి బోలెడన్ని కథల్ని చెప్పింది. ఆ తర్వాత అమ్మానాన్నలు చెప్పే కథలతోపాటు అన్న అక్క కథల పుస్తకాల్ని చదువుతుంటే వాటిని తనూ చెవికెక్కించుకుంది. అలా 18 నెలల వయసుకే అమ్మ చెప్పిన కథల్ని వాటి పేర్లతో సహా తడుముకోకుండా తిరిగి చెప్పేదట దాలియా. రెండేళ్ల వయసుకి సొంతగా కథలు చదవడం అలవాటు చేసుకుంది. అలా 2 సంవత్సరాల పదకొండు నెలలకి ఒక పుస్తకం కూడా చదివేసింది. నాలుగో ఏట అడుగుపెట్టే నాటికి దాలియా పూర్తిచేసిన పుస్తకాలెన్నో తెలుసా?? అక్షరాలా వెయ్యి పుస్తకాలు. అంతేకాదు కిండర్ గార్టెన్ ప్రవేశానికి ముందే వెయ్యికి పైగా పుస్తకాలని పూర్తిచేసి చిన్నారుల కోసం నిర్వహించిన ఒక కాంపిటీషన్‌లో మొదటి స్థానాన్ని దక్కించుకుంది.

గెయిన్స్ విల్లేలోని హాల్ కంట్రీ లైబ్రరీలో రోజూ పుస్తకాల్ని చదవడం, తోటి చిన్నారులకి కొత్త విషయాలని ఆసక్తికరంగా చెప్పడం దాలియా హాబీస్. అంతే కాదు ఆ లైబ్రరీకి ఒకరోజు లైబ్రేరియన్‌గా వ్యవహరించాలనే తన కలని నిజంచేసుకుంది దాలియా. ఎక్స్‌పర్ట్. పిగ్గీ సిరీస్ ఫేవరెట్ బుక్. ఎమ్ ఒ విలియమ్స్ రచనలని ఇష్టంగా చదివే దాలియాకి కష్టమైన పదాలని చెప్పడంలో అమ్మే సాయపడుతుంది. ప్రస్తుతం తండ్రి సాయంతో స్పానిష్ భాషని కూడా నేర్చేసుకుంటోంది.

పదవికాసం - 60

కూర్పు: రావెళ్ల

1		2		❀	3	4		5
	❀		❀	6	❀		❀	
7		❀	8		9	❀	10	
	❀	11		❀	12	13	❀	
❀	14		❀	❀	❀	15		❀
16	❀	17	18	❀	19		❀	20
21		❀	22	23		❀	24	
	❀	25	❀		❀	26	❀	
27				❀	28			

ఆధారాలు

అడ్డం

1. దగ్గరవు (4)
3. వాగు (4)
7. వెచ్చన (2)
8. నటించడం (3)
10. అటు నుండి పూయడం (2)
11. చెల్లెలు (2)
12. హద్దు (4)
14. ఆర్తనాదం (2)
15. పువ్వ (2)
17 కలనేసిన బట్టలజత కుడినుండి (2)
18. గుడిసె (2)
21. మర (2)
22. కొట్టం (3)
24. పర్యాయం (2)
27. ఏడాదిపొడవునా అటునుండి (4)
28. టపాకట్టు (4)

నిలువు

1. ఒకచోట కూడటం (4)
2. బియ్యం పొడి (2)
4. లత కాదు ఆపద (2)
5. చప్పుని (4)
6. చెరిగేందుకు ఉపయోగపడేది (6)
8. రక్తం లాగి బాధించే మంచంలోని పురుగు (2)
9. కొత్తదైన (2)
11.చెరువు (3)
13.జాకెట్టు (2)
16. ప్రొద్దుగుంకే సమయం (4)
18. నెహ్రూకి ముందు (2)
19. న్యాయం (2)
20. దోచుకోడానికి మార్గమధ్యంలో వేచి ఉండు (4)
23. బీజం (2)
25. రసం (2)
26. గట్టు (2)

సుడోకు

5						3	9	
		2			8		1	
1		4		2		5		8
	2	9	4	7				
		5	8		6	9		
8	6		9	1				
7			1				5	
				6	7			
				9				6

గతవారం జవాబులు

3	5	7	9	2	8	4	6	1
1	6	9	7	3	4	5	8	2
2	8	4	6	1	5	7	9	3
7	9	1	8	4	3	6	2	5
8	2	6	1	5	7	3	4	9
4	3	5	2	6	9	8	1	7
5	1	8	3	9	6	2	7	4
6	4	2	5	7	1	9	3	8
9	7	3	4	8	2	1	5	6

❀	1 అ	2 తి	వ	❀	3 ని	4 నా	దం	❀
5 కొం	❀	క్క	❀	6 మ్మ	❀	భి	❀	❀
7 డ	స్సి	❀	8 కృ	త్రి	క	❀	9 ద	10 పొ
నా	❀	11 పా	❀	క	❀	12 దా	❀	గ
13 లు	ద్ద	కు	డు	❀	14 న	రి	ది	బె
క	❀	డు	❀	15 నా	❀	స	❀	ట్టి
16 కు	ప్ప	❀	17 ప్ర	శ	స్తి	❀	18 మొ	న
❀	❀	19 స్వా	❀	నం	❀	20 ధా	❀	ట్టు
❀	21 కి	రీ	టి	❀	22 ప	త్రి	క	❀

ఓ వృక్షరాజంలో...!



'అవతార్'లో ఓ భారీ వృక్షం లోపల నివాసాలుంటాయి. అలాంటి ఓ మానవ ఆవాసానికే రూపకల్పన చేశారు కొరియా ఆర్కిటెక్ట్‌లు కో జిన్హియూక్, చియోంగ్ చాంగ్వాన్, చో క్యుహుంగ్, చొయ్ సున్‌వూంగ్. అమెరికాలోని దక్షిణ ప్రాంతంలో వంద మీటర్ల ఎత్తు వరకు ఎదిగే భారీ సెక్వియా వృక్షరాజాల్లో ఈ అద్భుతాన్ని ఆవిష్కరించొచ్చని అంటున్నారు. మోడుబారిపోతున్న కృశించుకుపోతున్న సెక్వియా చెట్లను గుర్తించి అవి కూలిపోకుండా కృత్రిమంగా దన్ను అందిస్తూ వాటి లోపలి ఖాళీ కుహరాల్లో నిర్మాణాలు కట్టి పర్యాటకులకు పర్యావరణ పరిస్థితులను అతి దగ్గరగా చూపించాలనే ప్రయత్నం దీనిలో ఉంది. భూ తాపం ప్రభావానికి కుప్ప కూలుతోన్న వృక్షరాజాల్లో సెక్వియాలు కూడా తోడవుతున్నాయి. కీటకాల వృద్ధికి కారణమవుతున్న పర్యావరణ మార్పులు, కాలుష్యాలు వేల ఏళ్లుగా ఎన్నో తాకిడిలను తట్టుకుని నిలబడిన సెక్వియా వృక్షరాజాలను నేలకూలుస్తున్నాయి. ఇప్పుడీ ప్రకృతి హిత ఆకాశహర్మ్యాల ద్వారా ఆ ప్రభావాలను దగ్గరగా చూపించొచ్చు. ఈ ప్రాజెక్ట్ పేరు 'ట్రిబ్యూట్: ది మోన్యుమెంట్ ఆఫ్ జెయింట్'. రెడ్ ఇండియన్లు ఆరాధించే ఓ సెక్వియా వృక్షాన్ని తొలుత ఎంచుకున్నారు. దీనిలో వరస ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేసి వాటిలో విద్యాశాలలు, ప్రయోగ శాలలు, ప్రదర్శన శాలలు, పరిశీలన సముదాయాల్ని నిర్మించాలనేది ఆలోచన. వృక్షం తిరిగి జీవం పొందే విధంగా దానిని పటిష్టపరచడం, పోషకాలు అందేలా ఏర్పాట్లు చేయడం ప్రాజెక్ట్‌లో భాగం. 2100 కల్లా ఇప్పుడున్న మోడువారిన వృక్షం బదులు పూర్తి జీవంతో కళకళలాడే మరింత ఎత్తుకు పెరిగే విధంగా సంరక్షణ చర్యలు తీసుకుంటారు. 'అవతార్'లో అంతటి వృక్షం నేలకొరుగుతున్న దృశ్యం గుండెను కోసేస్తుంది. కానీ ఇలా క్రమంగా నిర్జీవంగా మారుతూ కూలబోతున్న మహా వృక్షాన్ని నిలబెట్టాలనే ప్రాజెక్ట్ చాలా అర్థవంతంగా అనిపిస్తోంది కదూ.









Contact for Corporate Programs
Cell: 98481 90302

You have Problems?
I have Solutions !

సమస్యలతో రండి!
సక్సెస్‌తో దూసుకుపొండి...

నత్తి, డిప్రెషన్, గుండెదడ, నరాల బలహీనత, భయం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ప్రేమ వైఫల్యం, మద్యం, సిగరెట్లు, ఖైనీ, ఆత్మవిశ్వాసం లోపించడం, మరియు అనేక సమస్యలకు ఎంతో మంది నా వద్దకు వచ్చి హిప్నో-సైకోథెరపీ ద్వారా పరిష్కరించుకున్నారు. సక్సెస్ అయ్యారు, ఇక మీ వంతు, మీకు సమస్యలున్నా, సక్సెస్ కావాలన్నా భవిష్యత్‌లో స్థిరపడాలన్నా...

VIP Vidhatha *Institute of Personality Developmnet*

34 ఏళ్ళ అనుభవంతో **వ్యక్తిత్వ వికాసం** రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు నెట్‌వర్క్ మార్కెటింగ్ ప్రతినిధులకు షాపింగ్‌మాల్స్, హాస్పటల్ సిబ్బందికి స్కూల్స్, ఇంజనీరింగ్, మేనేజమెంట్ కాలేజిలకు, ప్రత్యేక శిక్షణ కై సంప్రదించండి

నేనున్నాను !

Ψ క్రాంతికార్

(Psychologist , Hypno-Therapist & HRD trainer)
(PhD),MSc(Psychology),MSc(Counseling Psychology), MSc(App Psy), MA (Child Care),BSc(Psy),BA(Psy),BNat (Naturopathy & Yoga), DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS), MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More

ప్రముఖ సైకాలజిస్ట్ & హిప్నోథెరపిస్ట్

చైల్డ్ సైకాలజీ

మీ పిల్లలో అల్లరి, టీ.వి. చూడటం, సెల్‌ఫోన్, నెట్ వాడటం, బద్ధకం, కోపం, మాట వినకపోవటం, ఎక్కువ అయిందా?
చదువు తగ్గిందా? కాలేజీకని చెప్పి తిరిగి తిరిగి వస్తున్నారా?
మీ పిల్లలు హీరోలు కావాలనుకుంటున్నారా?

త్రాగే వ్యక్తి కి తెలియకుండా మందు మాన్పించబడును.

websites : www.krantikar.blogspot.in
www.vidhatha.in, www.kranthikar.com
www.facebook.com/krantikar ye

Hyderabad : 93 93 11 2021, Vizag : 9440 633 610

Check List

Book Number	KNSR02B/69	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	No		
Missing Pages	No		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	[illegible]	Pages	29